● నకిలీ పట్టాలతో జోరుగా భూ ఆక్రమణలు
● చోద్యం చూస్తున్న రెవెన్యూ అధికారులు



ప్రభుత్వ జాగా.. వేసేయ్ పాగా..

ప్రభుత్వ భూమి కనపడితే చాలు.. గద్దల్లా వాలిపోతున్నారు. రాత్రికి రాత్రే తిష్ట వేసి వారి కబంధ హస్తాల్లోకి తీసేసుకుంటున్నారు. ఎక్కడ ఖాళీ ఉంది.. ఏ ప్రాంతం మనకు అనువుగా ఉంటుంది.. ఎవరి ద్వారా పనవుతుందనే విషయాలు పసిగట్టి ఆక్రమణ చేయడమే వారి పని. ఎక్కడ ప్రభుత్వ భూమి కబ్జాచేసినా, వారి ప్రమేయం లేనిదే భూ ఆక్రమణ జరగదని టాక్. మండలంలోని ప్రతి గ్రామంలో ఒకరిద్దరిని తమ ముఠాలో చేర్చుకుని భూముల సమాచారాన్ని సేకరిస్తారు. ఆ వెంటనే రెవెన్యూ కార్యాలయానికి చేరుకోవడం.. తాత్కాలిక ప్రాతిపదికన పనిచేసే ఉద్యోగి ద్వారా రికార్డులను తెప్పించుకోవడం.. భూ ఆక్రమణ చేసి నకిలీ పట్టాలు సృష్టించడం వారికి వెన్నతో పెట్టిన విద్య. గత వైసీపీ ప్రభుత్వంలో మండలంలో భూ ఆక్రమణలు పెద్దఎత్తున జరిగాయి. ఇప్పుడు ఈ ముఠాపై మండలంలో ఎక్కడ చూసినా చర్చ నడుస్తోంది.


ఎక్సకవేటర్లతో చదును చేసిన భూమి

ఒంటిమిట్ట, సెప్టెంబరు 20: మండల కేంద్రంలో రోజురోజుకు ప్రభుత్వ భూములు కనుమరుగవుతున్నాయి. ఈరోజు ప్రభుత్వ భూమిగా ఉంటే.. మరుసటి రోజుకు పట్టా భూమిగా మార్చేసే భూ మాయగాళ్లు ఎక్కువైపోయారు. ఈ నేపథ్యంలోనే మండల కేంద్రానికి ఆమడ దూరంలో నూతనంగా జాతీయ రహదారి 2049 సర్వే నంబర్లలో వెళుతుందని ముందుగానే పసిగట్టిన భూ మాయగాళ్లు ఆ ప్రాంతంలో నకిలీ పట్టాలను సృష్టించి పెద్దఎత్తున భూ ఆక్రమణలు చేపట్టారు. రాత్రికి రాత్రే ఎక్సకవేటర్ల సాయంతో గుంతలు తవ్వి తాత్కాలిక ప్రాతిపదికన చిన్నపాటి దిమ్మెలతో రూములను ఏర్పాటు చేసి ఆక్రమణలు చేపట్టారు. దీనిపై పలుసార్లు ఫిర్యాదు చేసిన రెవెన్యూ అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు. గతంలో కడప ఆర్డీవోగా పనిచేసిన మధుసూదన్‌రావు ఆక్రమణకు గురవుతున్న ప్రాంతాన్ని పరిశీలించి చర్యలు తీసుకుంటున్నామని ప్రకటించారు. అయినా ఆక్రమణదారులు రెవెన్యూ అధికారుల మాటలను బేఖాతరు చేసి వారు వెళ్లిన వెంటనే మళ్లీ వారి పనుల్లో నిమగ్నమైపోతుండం చూసి పలువురు హవ్వా..! అనుకుంటున్నారు. 2049 సర్వే నంబరులో ప్రభుత్వ భూమి 340 ఎకరాలు ఉండేవి. అందులో 6.10 సెంట్లు స్థలం 1089 మందికి ఇంటిపట్టాలను ప్రభుత్వం మంజూరు చేసింది. అది కాక మరో 24 ఎకరాలు ఆరు లైన్ల జాతీయ రహదారికి కేటాయించారు. మిగిలిన హైవేకు అనుకుని ఉన్న అటు వైపు, ఇటువైపు ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించేశారు. దిమ్మెలతో దాదాపు 10 సెంట్ల మేర హద్దును ఏర్పాటు చేసి అందులో చిన్నరూమును ఏర్పాటు చేసి సెంటు రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు విక్రయించేస్తున్నారు. అమ్మినవారి పేరుతోనే నకిలీ పట్టాలను అప్పటికప్పుడే సృష్టించి తయారు చేయడం వారికి చాలా సులువైన పనిగా మారింది. దీనిపై పెద్దఎత్తున రెవెన్యూ అధికారులపై విమర్శలు నెలకొన్నాయి. రెవెన్యూ అధికారులే దగ్గరుండి పట్టాలను తయారు చేయించి అమ్మివేశారన్న అపవాదులు వారిపై నెలకొన్నాయి. గతంలో మండల రెవెన్యూ అధికారిగా పనిచేసిన అధికారి ఇందులో కీలకంగా వ్యవహరించారని ప్రచారం నెలకొంది. వీరితోపాటు తాత్కాలికంగా ప్రాతిపదికన పనిచేసే మరో కొంతమంది సిబ్బంది కూడా ఆక్రమణకు సహకరించారని పెద్దఎత్తున విమర్శలు ఉన్నాయి. రెవెన్యూ కార్యాలయం నుంచి రికార్డులు బయటకు తరలించి నకిలీ పట్టాలకు, ఏ సర్వేనంబర్లు వేయాలని, ఎప్పుడు తేదీ వేయాలనే దానిపై అధికారులు దగ్గరుండి చేపట్టారన్న విమర్శలు నెలకొన్నాయి.


ఆక్రమణ జరిగిన ప్రాంతాన్ని పరిశీలించిన అప్పటి ఆర్డీవో మధుసూదన్‌రావు (ఫైల్‌ఫొటో)

రూ.3 వేలు కొట్టు.. పట్టా పట్టు...

తమ పేరుతో పట్టాలను తయారు చేయాలంటే ఒక్కొక్కరు కేవలం రూ.3 వేలు చెల్లిస్తే చాలు.. పట్టా ఇచ్చేస్తున్నారంటూ మండలంలో పెద్దఎత్తున ఆరోపణలున్నాయి. ప్రభుత్వ భూమిలో గత 20 సంవత్సరాల క్రితం పనిచేసిన తహసీల్దారు సంతకంతో నకిలీ పట్టాలను సృష్టించి, తహసీల్దార్ల, వీఆర్‌ఓల సీళ్ల తయారు చేయడం చూసి రెవెన్యూ అధికారులే అవాక్కవుతున్నారు. ఈ నకిలీ పట్టాలను పెద్దఎత్తున పంపిణీ చేసినట్లు చెబుతున్నారు. 2049 సర్వేనంబరులో జాతీయ రహదారికి అనుకుని ఉండడం, ఎలాగైనా తమకు, తమ కుటుంబ సభ్యులకు ఉపయోగపడుతుందని ఆశతో పేద ప్రజలు పెద్దఎత్తున నకిలీ పట్టాల మాయలో పడిపోతున్నారు. మరికొందరు డబ్బులు పోగొట్టుకొని.. పట్టాలు రాకపోవడంతో ఆక్రమణదారుల చుట్టూ తిరుగుతున్నారు. ఆక్రమణదారులు మాత్రం మీరిచ్చిన డబ్బులు తాము ఇతరులకు ఇచ్చామని, మీకు ఇచ్చిన భూమి ఎక్కడికి పోదని, మీరు అక్కడ రూము వేసుకోవాలని ఉచిత సలహాలు ఇచ్చి పంపుతున్నట్లు బాధితులు బహిరంగంగా చెబుతున్నారు.

ఆక్రమణలు జరిగినట్లు గుర్తించాం..


మండల పరిధిలోని 2049 సర్వే నెంబరులో గతంలో ఆక్రమణలు జరగడంతో రెవెన్యూ సిబ్బంది గుర్తించినట్లు తెలిసింది. నేను నూతనంగా బాధ్యతలు తీసుకున్నాను. దీనిపై విచారణ చేయాల్సి ఉంది. రెవెన్యూ రికార్డులు, సిబ్బంది ద్వారా బయటకు వెళ్లాయని తెలిసింది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. రికార్డులు పరిశీలించి ఆక్రమణలు చేసిన వారిపై చర్యలు తీసుకుంటాం.

\- రమణమ్మ, తహసీల్దార్, ఒంటిమిట్ట


హద్దులను ఏర్పాటు చేసి పెద్దఎత్తున రూములు కట్టిన దృశ్యం

నకిలీ పట్టాల్లో కీలకంగా ప్రభుత్వ ఉపాధ్యాయుడు

మండలంలో భూ అక్రమాలు పెద్దఎత్తున సృష్టించడంలో మండలంలో పనిచేస్తున్న ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు క్రియాశీలకంగా ఉన్నట్లు పెద్ద చర్చనీయాంశంగా మారింది. విద్యార్థులకు పాఠాలు బోధించాల్సిన ఉపాధ్యాయుడు ప్రభుత్వ భూములకు నకిలీ పట్టాలు సృష్టించి పేద ప్రజలకు అమ్మి పెద్దఎత్తున సొమ్ము చేసుకున్నట్లు విమర్శలున్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో కూడా పెద్దఎత్తున చింతరాజుపల్లె, జోకులపల్లె, పెన్నపేరూరు, ఇబ్రహీంపేట ప్రాంతాల్లో పెద్దఎత్తున ఆక్రమణలకు తెరలేపినట్లు ఈ ముఠాపై ఆరోపణలు ఉన్నాయి.



ప్రభుత్వ స్థలం ఇచ్చినట్లుగా నకిలీ పట్టాలు సృష్టించిన దృశ్యం

ఆలస్యంగా నడిచిన సెవెన్‌హిల్స్ ఎక్స్‌ప్రెస్

కలికిరి, సెప్టెంబరు 20: తిరుపతి నుంచి పాకాల, కలికిరి, కదిరి, అనంతపురం మీదుగా హైదరాబాదు వెళ్లాల్సిన సెవెన్‌హిల్స్ ఎక్స్‌ప్రెస్ (12769 నంబరు) రైలు శుక్రవారం రెండున్నర గంటలు ఆలస్యంగా నడిచింది. తిరుపతి నుంచి సాయంకాలం 5 గంటలకు కలికిరికి రావాల్సిన ఈ రైలు 7.35 గంటలకు ఆలస్యంగా చేరుకుంది. అంతకు ముందు పాకాల జంక్షన్‌లో ఈ రైలు రెండున్నర గంటల పాటు ఆగింది. ఇంజిన్‌లో తలెత్తిన సాంకేతిక కారణాల వల్ల రైలును పాకాల జంక్షన్‌లో ఆపాల్సి వచ్చిందని రైల్వేవర్గాలు తెలిపాయి. సాంకేతిక నిపుణులను రప్పించి అవసరమైన మరమ్మతులు పూర్తి చేసిన అనంతరం ఈ రైలు రెండున్నర గంటలు ఆలస్యంగా కలికిరి చేరుకుంది. రైలు రాక ఆలస్యం కావడంతో ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు.

గల్ఫ్ నుంచి స్వగ్రామానికి చేరిన మైమూన్

● లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలిపిన బాధితురాలు


మైమూన్‌కు ఆర్థిక సాయం అందిస్తున్న జనసేన నేతలు

నిమ్మనపల్లి, సెప్టెంబరు 20: కువైత్‌లో చిత్రహింసలకు గురవుతున్న మైమూన్ ఎట్టకేలకు గురువారం అర్ధరాత్రి స్వగ్రామానికి చేరుకుంది. ఈమె ఏడాది క్రితం ఆర్థిక ఇబ్బందుల కారణంగా కువైత్‌కు వెళ్లింది. వెళ్లినప్పటి నుంచి అక్కడ ఇబ్బందులకు గురవుతూ ఉండేది. ఈ నేపథ్యంలో తనను నరకం నుంచి కాపాడాలని గత నెల 27న సోషల్ మీడియాలో రాష్ట్ర విద్యాశాఖమంత్రి నారా లోకేశ్‌ను వేడుకొంది. దీనికి స్పందించిన ఆయన బాధితురాలిని ఇండియాకు తీసుకువస్తానని ఎక్స్ వేదికగా హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ మేరకు లోకేశ్ బృందం ఆమెను నిమ్మనపల్లి మండలంలోని స్వగ్రామమైన సింగంవారిపల్లికి చేర్చడంతో ఆమె కన్నీటిపర్యంతమయ్యారు. ఆమె మాట్లాడుతూ తాను ఇండియాకు వస్తానని అనుకోలేదని, లోకేశ్ అన్న చొరవతోనే తాను ఇంటికి చేరుకున్నానని, ఆయనకు తమ కుటుంబం రుణపడి ఉంటుందని తెలిపారు. కాగా మైమూన్ వచ్చిన సంగతి తెలియడంతో మండల జనసేన ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్ ఆమె ఇంటికి చేరుకొని ధైర్యం చెప్పారు. తనవంతు సాయంగా రూ.5 వేలను అందించారు. ఏ అవసరమొచ్చినా తామున్నామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు శివకుమార్, రమణ తదితరులు పాల్గొన్నారు.

సెలెక్టెడ్ ఎంపీటీసీలు గోబ్యాక్

● మండల మీట్‌ను అడ్డుకున్న కూటమి శ్రేణులు

బి.కొత్తకోట, సెప్టెంబరు 20: సెలెక్టెడ్ ఎంపీటీసీలు గోబ్యాక్.. మీరు ఎలక్టెడ్ ఎంపీటీసీలు కాదు.. ఎన్నికల్లో నిలిచి ప్రజల చేత ఎంపికై రండి... మిమ్మల్ని స్వాగతిస్తాం.. అంటూ టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు.. వైసీపీ ఎంపీటీసీలను అడ్డుకున్నారు. శుక్రవారం బి.కొత్తకోటలోని ఎంపీడీఓ కార్యాలయంలో 11 గంటలకు సమావేశం జరగాల్సి ఉండగా 10 గంటలకే టీడీపీ నాయకులు అక్కడికి చేరుకొని కార్యాలయ గేటుకు తాళం వేసి అడ్డుగా కూర్చున్నారు. వారికి సంఘీభావంగా మండలంలోని వివిధ గ్రామాల నుంచి కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున అక్కడికి చేరుకున్నారు. గత ఐదేళ్ల వైసీపీ అరాచక పాలనకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ రాచరికపు ధోరణితో వైసీపీ ఎమ్మెల్యే ప్రజాస్వామ్యాన్ని తుంగలో తొక్కి ఎంపిక చేయించారని, అలాంటి వారికి పదవిలో కొనసాగే నైతికహక్కు లేదన్నారు. మండలమీట్ జరగనిచ్చే సమస్యే లేదని తేల్చి చెప్పారు. సమావేశానికి హాజరయ్యేందుకు వచ్చిన ఎంపీపీ లక్ష్మీనరసమ్మను లోనికి రానీయకుండా అడ్డుకున్నారు. దీంతో ఆమె నేలపై కూర్చుని నిరసన తెలిపారు. కాగా సీఐ రాజారెడ్డి ముందస్తు చర్యలు చేపట్టారు. ములకలచెరువు సీఐ రాజారమేష్, పీటీఎం, తంబళ్లపల్లె, నిమ్మనపల్లె ఎస్సైలతో పాటు 50 మంది పోలీసు బలగాలను మోహరించారు. టీడీపీ నిరసనతో పాటు తగినంత మంది ఎంపీటీసీలు హాజరు కాకపోవడంతో కోరం లేక మండల మీట్‌ను వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీవో శంకరయ్య ప్రకటించారు. దీంతో కూటమి నాయకులు నిరసన విరమించారు. కార్యక్రమంలో జనసేన నాయకుకులు చింతలకిరణ్, టీడీపీ నాయకులు లోకనాథరెడ్డి, శివరాంరెడ్డి, మొటుకుశివ, నాయన బావిశిద్దారెడ్డి, జయచంద్రారెడ్డి, చావిడి కిట్టన్న, ఎండీ మస్తాన్, రియాజ్‌అలీ పాల్గొన్నారు.


ఎంపీడీఓ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న కూటమి నేతలు

విద్యార్థులను సొంత బిడ్డల్లా భావించాలి

● కలెక్టర్ శ్రీధర్ చామకూరి

రాయచోటి(కలెక్టరేట్), సెప్టెంబరు 20: ప్రభుత్వ వసతి గృహాల్లో వున్న విద్యార్థులను సొంత బిడ్డల్లా భావించాలని, బాగా చదువుకొనేలా ప్రోత్సహించాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్లో సంక్షేమశాఖ అధికారులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం వసతి గృహాల నిర్వహణకు కోట్లు ఖర్చు చేస్తుంటే, దాన్ని అమలు చేయడంలో లోపాలు వుంటూ ఫిర్యాదులు రావడం సమం జసం కాదన్నారు. హాస్టళ్లలో మరుగుదొడ్లు, తాగునీరు, కరెంట్, తదితర అంశాల్లో జాగ్రత్తలు తీసుకోవాలని వార్డెన్లకు సూచించారు. జిల్లాలో బాలికల హాస్టళ్లలో చాలా వరకు మరుగుదొడ్లు సరిగా లేవని, విద్యార్థులు తన దృష్టికి తీసుకొచ్చారని, వాటిపై దృష్టి పెట్టి ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఇందుకోసం పాఠశాల అభివృద్ధి నిధులు ఖర్చు చేయాలని తెలిపారు. వారంలో ఏదో ఒక హాస్టల్‌ను సందర్శిస్తామని, తహసీల్దార్లు కూడా హాస్టల్ విజిట్ చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, సంక్షేమశాఖ అధికారులు సందప్ప, రామసుబ్బయ్య, తేజస్విని, వార్డన్లు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

రహదారి భూసేకరణపై అధికారులను విచారిస్తున్న జేసీ ఆదర్శ రాజేంద్రన్



అర్హులందరికీ పరిహారం చెల్లిస్తాం

● జేసీ ఆదర్శ రాజేంద్రన్

మదనపల్లెటౌన్, సెప్టెంబరు 20: మదనపల్లె-పీలేరు మధ్య నిర్మిస్తున్న జాతీయ రహదారి-71లో భూమి, ఇళ్ల స్థలాలు కోల్పోతున్న అర్హులందరికీ నష్టపరిహారం చెల్లిస్తామని జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ పేర్కొన్నారు. శుక్రవారం మదనపల్లె మండలం తట్టివారిపల్లె జంక్షన్ వద్ద భూసేకరణ పనులను జేసీ పరిశీలించారు. తట్టివారిపల్లెకు చేరుకున్న జేసీ ఇళ్ల స్థలాలు వున్న ప్రాంతంలో రెవెన్యూ రికార్డుల ప్రకారం ఏం వివరాలు వున్నాయో సర్వేయర్‌ను అడిగి తెలుసుకున్నారు. అక్కడ కాలువ ఏదైనా వుందా, లేదా ప్రభుత్వ భూమిలో నిర్మాణాలు చేపట్టారా అన్న విషయాన్ని సమగ్రంగా సర్వే చేయాలని ఆదేశించారు. సర్వే నివేదిక ఆధారంగా అసలైన నిర్వాసితులకు నష్టపరిహారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్, తహసీల్దార్ ఖాజాబీ, సర్వేయర్ సుబ్రమణ్యం, ఎన్‌హెచ్ అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు డైట్ చార్జీలు పెంపు

కలికిరి, సెప్టెంబరు 20: కలికిరిలో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న మహిళా రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాల విద్యార్థినులకు నెలవారీ డైట్ చార్జీలను పెంచుతూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. కలికిరితో పాటు ఎన్టీఆర్ జిల్లా కంచికచెర్లలోని మహిళా రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాల, కర్నూలు ప్రభుత్వ సిల్వర్ జూబ్లీ కళాశాలకు ఈ పెంపుదల వర్తింపజేశారు. ఒక్కో విద్యార్థినికి ఇంతవరకు నెలకు ఇస్తున్న రూ.1400లను రూ.1600లకు పెంచారు. 2024-25 విద్యా సంవత్సరానికి ఈ పెంపు ఉంటుంది. ఈ మూడు కళాశాలలకు కలిపి రూ.2 కోట్ల 95 లక్షల 68 వేలు మంజూరు చేశారు. ఈ మేరకు రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి సౌరబ్‌గౌర్ శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు.

ఆలయ భూములు స్వాహా..!

● ప్లాట్లు, తారురోడ్డు వేసి విక్రయాలు ● అస్తిత్వం కోల్పోతున్న దేవాలయాలు ● చోద్యం చూస్తోన్న అధికారులు


సుండుపల్లి నడిఒడ్డున పిచ్చిమొక్కల మధ్య సుండుపల్లెమ్మ ఆలయం

సుండుపల్లి, సెప్టెంబరు 20: నిత్య ధూప, దీప, నైవేద్యాలకు, ఉత్సవాల నిర్వహణకు లోటు లేకుండా ఎందరో దాతలు మండలంలోని ఆలయాలకు భూములు సమకూర్చారు. కానీ దేవాదాయశాఖ అధికారుల నిర్లక్ష్యంతో మండలంలో భూములు అన్యాక్రాంతమయ్యాయి. దేవుళ్ల భూములు అడ్డగోలుగా క్రయ విక్రయాలు, రిజిస్ట్రేషన్లు కూడా చేస్తున్నారు. అధికారులు మాత్రం ఆక్రమణలు తొలగించడం సంగతి అటుంచి.. కనీసం నోటీసు ఇచ్చేందుకు కూడా తటపటాయిస్తున్నారు. గత నెల రోజుల ముందు స్థానికుల ఫిర్యాదుతో అధికారులు వచ్చి మాన్యం భూముల ఆక్రమణపై చర్యలు తీసుకుంటామన్నారు. ఆపై పట్టించుకున్న పాపానే పోలేదు. మళ్లీ ఈ నెల 18న ఏకంగా జిల్లా దేవదాయశాఖ అధికారులు పలు ఆలయాల మాన్యం భూములు అన్యాక్రాంతమయ్యాయని చెప్పారే కానీ కనీసం నోటీసులు సైతం ఇవ్వలేదు.

సుండుపల్లెమ్మ కన్పించట్లేదు

మండల కేంద్రం నడిఒడ్డున వెలసి దశాబ్దాల కాలంగా పూజలు అందుకున్న సుండుపల్లెమ్మ కన్పించట్లేదు. నిత్యం ధూప, దీప నైవేద్యాలతో, ఉత్సవాలతో వర్ధిల్లిన అమ్మవారి ఆలయం శిథిలావస్థకు చేరుకుంది. చుట్టూ ప్లాట్లు వేసి విక్రయించేశారని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రాంగణం పిచ్చిమొక్కలతో నిండిపోయింది. స్థానికులు చెత్త, చెదారం అక్కడే వేస్తున్నారని, చెత్తను తొలగించి ఆలయానికి రక్షణ కల్పించాలని, జిల్లా దేవదాయశాఖ అధికారికి భక్తులు వినతిపత్రం అందజేశారు. అంతే కాకుండా అమ్మవారికి చెందిన భూములు ఇతరుల ఆధీనంలో ఉన్నట్లు భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఓదేటమ్మ మాన్యంలో తారు రోడ్డు

మండల కేంద్రానికి సమీపంలో గుంతరాచపల్లి రహదారిలో ఓదేటమ్మ మాన్యం వుంది. ఆ భూములు ప్లాట్లుగా దర్శనమిస్తున్నాయి. 511 సర్వే నెంబరులో 5.14 ఎకరాల మాన్యం భూమి వుందని అధికారులు చెబుతున్నారు. అక్కడ దర్జాగా ప్లాట్లు వేసి విక్రయించేస్తున్నారు. అంతేకాకుండా ఓదేటమ్మ మాన్యం నుంచి ఇతరుల ప్లాట్లకు తారు రోడ్డు వేసి ప్లాట్ల వ్యాపారం చేస్తున్నారు. ఇదంతా జరుగుతున్నా అధికారులు మాత్రం తమకు పట్టనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శలున్నాయి. కొంత స్థలం (1 ఎకరా పైన) ఇతరులకు పట్టా వున్నట్లు తెలుస్తోంది.

ఆలయ భూములు కాపాడుతాం..

ప్రైవేటు వ్యక్తుల ఆధీనంలో ఉన్న దేవదాయశాఖ భూములు కాపాడుతాము. ఆలయాలకు సంబంధించిన భూములు ఆక్రమించడం చట్టరీత్యా నేరం. వారం రోజుల్లో భూములు ఆక్రమించి వ్యక్తులకు నోటీసులు జారీ చేస్తాము. పై అధికారుల ఆదేశాల మేరకు ఆలయ భూములు స్వాధీనం చేసుకుంటాము.

\- వెంకటరమణారెడ్డి, దేవదాయశాఖ ఈఓ, సుండుపల్లి

భూములున్నా... ఆదరణ కరువు

మాన్యం భూములున్నా... ఈ ఆలయాలకు ఆదరణ కరువవుతోంది. ధూప, దీప నైవేద్యాలకు దూరమవుతున్నారు. ఆవు దేవత దేవస్థానం, చౌడేశ్వరమ్మ దేవస్థానం, సుబ్రమణ్యం స్వామి, విరూపాక్ష చెన్నకేశవస్వామి, సుండుపల్లెమ్మ, యల్లమ్మతల్లితో పాటు పలు ఆలయాల పేర్లతో భూములున్నాయి. కాగా ఆ భూములు ఇతరులు అనుభవిస్తున్నట్లు విమర్శలున్నాయి. ఇదంతా అధికారులకు పట్టడం లేదని తెలుస్తోంది. ఇన్ని భూములున్నా ఈ ఆలయాలు దీన స్థితికి చేరుకున్నాయి. కొన్ని ఆలయాల్లో అసలు పూజలు సైతం జరగడం లేదు.

గడువు ముగిసినా వేలం లేదా...

మండల కేంద్రంలో చుట్టుపక్కల దేవుని మాన్యాలకు 2 సంవత్సరాలకు ఒకసారి వేలం నిర్వహిస్తారు. అయితే గత ప్రభుత్వంలో 07.06.2021 సంవత్సరంలో మాన్యాలకు వేలం నిర్వహించారు. 07.06.2023కు గడువు ముగిసింది. అయినా అధికారులు వేలం నిర్వహించడం లేదు. గతంలో పాడుకున్న వ్యక్తుల కనుసన్నల్లోనే భూములు ఉన్నాయి. ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారనే విమర్శలు ఉన్నాయి.

మండలంలో దేవదాయశాఖ భూములు ఆక్రమణల్లో మగ్గిపోతున్నాయి. ఎందరో మహనీయులు ఆలయాలకు దానమిచ్చిన భూములు అన్యులపరమైపోయాయి. ధూప, దీప, నైవేద్యాలతో కళకళలాడాల్సిన ఆలయాలు దీనావస్థలో ఉన్నాయి. కళ్ల ముందే ఇంత జరుగుతున్నా కళ్లప్పగించి చూడటం తప్ప అధికారులు చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ఏకంగా మాన్యం భూముల్లో తారురోడ్డు వేసి.. ప్లాట్లుగా విభజించి విక్రయిస్తున్నా.. సంబంధిత అధికారులు చూసీ చూడనట్లు ఉన్నారు. కూటమి ప్రభుత్వంలోనైనా బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.


ఓదేటమ్మ దేవునిమాన్యంలో వేసిన తారురోడ్డు

అల్జీమర్స్.. చికిత్స లేని జబ్బు



- వ్యాధి తీవ్రతను మాత్రమే తగ్గించవచ్చు
- జబ్బు కనుగొనడానికే.. పదేళ్లు సమయం
- ఆహార అలవాట్లు, జీవనశైలితోనే నివారణ
- నేడు ప్రపంచ అల్జీమర్స్‌డే

కడప (సెవెన్‌రోడ్స్), సెప్టెంబరు 20: ఇంట్లో బండిబీగాలు ఎక్కడో ఒక చోట పెట్టడం... ఎక్కడెక్కడో వెతకడం.. కళ్లజోడు ఇక్కడే పెట్టాను.. కనిపించడం లేదే.. అంటూ ఇంట్లోని వాళ్లపై అరవడం... ఏదైనా వస్తువు అవసరం వచ్చినప్పుడు ఒక పట్టాన గుర్తుకు రాకపోవడం... లాంటివి సాధారణంగా ప్రతి ఇంటిలో... ప్రతి రోజూ జరిగే తంతే ఇది.. అయితే ఇలా ప్రవర్తించే వ్యక్తుల్లో మతిమరుపుస్థాయి ఎక్కువైతే.. దీనినే అల్జీమర్స్ (మతిమరుపు) అని అంటారు. ఈ వ్యాధి తీవ్రత ఎక్కువైతే.. ఇంట్లో పెట్టిన వస్తువులను మరిచిపోవడం కాదు కదా.. ఇంటినే మర్చిపోయేంత.. ఇంకా చెప్పాలంటే .. తనను తానే.. తన పేరును, ఊరును చివరికి తన ఒంటి మీద బట్టలు ఉన్నాయో లేదో గుర్తురెగకపోవడం.. ఎవరైనా పిలిచినా పలకరు. ఎవర డిగినా చెప్పరు. చెప్పలేరు కూడా. ఈ వ్యాధి తీవ్రత మాటల్లో చెప్పినంత కాకుండా.. అంతకు మించే ఉంటుంది. అసలు తమను తామే మరిచి పోయి ఒక రకమైన నిస్సహాయ ప్రపంచంలో బతుకుతుంటారు. ఇలా అల్జీమర్స్ వ్యాధిన పడ్డ వారిని గుర్తించి, ఈ వ్యాధి తీవ్రత, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అవగాహన కల్పించేందుకు సెప్టెంబరు 21న ప్రపంచ అల్జీమర్స్‌డేను నిర్వహిస్తారు.

అల్జీమర్స్... వ్యాధి తీవ్రమైతే..




అల్జీమర్స్ ఈ పదం వినడానికి, అనడానికి చాలా తేలికగానే ఉన్నప్పటికీ ఈ వ్యాధి తీవ్రత చాలా భయానకం. వ్యాధిని కనుగొనడానికే సుమారు పది సంవత్సరాలు పడుతుంది. మతిమరుపునకు సంబంధించిన 'డిమెన్షి యా'లో ఒక రకం ఈ అల్జీమర్స్. ఈ అల్జీమర్స్ వల్ల మెదడులో నిక్షిప్తమై ఉండే జ్ఞాపకాలు, నైపుణ్యాలు, అనుభవాలు, శక్తి సామర్థ్యాలు, నేర్పు ఓర్పు అన్నీ తుడుచుకు పోతాయి. ఈ అల్జీమర్స్ వల్ల మానసిక, సామాజిక నైపుణ్యాలు పూర్తిగా క్షీణిస్తాయి. సాధారణంగా వయసుపైబడ్డ వాళ్లలో అంటే 60 సంవత్సరాలు దాటిన వారిలో అల్జీమర్స్ అధికంగా కనబడుతుంది. కానీ నేటి యాంత్రిక జీవనంలో ఇంతకంటే చిన్నవయస్సులోనే ఈ వ్యాధి బారిన జనాలు పడుతున్నారు. ముందుగా గుర్తించి చికిత్స తీసుకోవడమే ఉత్తమం.

వ్యాధిని గుర్తించడం ఎలా...



అల్జీమర్స్ వ్యాధిని గుర్తించడం చాలా కష్టం. కుటుంబ సభ్యులు వ్యాధి లక్షణాలు ఉన్న వారిని గుర్తించి.. వైద్యులను సంప్రదిస్తే తప్ప ఈ వ్యాధి సోకిందని గుర్తించలేరు. వీరు ఇతరులకంటే భిన్నంగా ప్రవర్తిస్తుంటారు. ఇతరుల సమక్షంలో బట్టలు మార్చుకోవడం, పట్టరాని కోపంతో ఊగిపోవ డం, కారణం లేకుండానే భావోద్వేగాలకు లోనుకావడం, తమను తాము నియంత్రించుకోలేక పోవడం, నిరాశతో ఉండడం, బరువు తగ్గడం, చర్మ సంబంధిత వ్యాధులు, ఇన్ఫెక్షన్లు రావడం, గొణుక్కోవడం, మూలగడం, యూరిన్ నియంత్రించుకోలేకపోవడం, మాటల్లో తేడా, నిర్ణయాలు తీసుకోలేకపోవడం, ప్లానింగ్ లేకపోవడం, కొట్టడం, నవ్వడం, నిద్రపోకపోవడం, బట్టలు చించుకోవడం, గొనుక్కోవడం, తమలో తామే మాట్లాడుకోవడం, చుట్టూ ఉండేవారిని.. పరిసరాలను పట్టించుకోకపోవడం, అన్నింటినీ మించి అనుమానించడం వంటివి ఈ వ్యాధి ప్రధాన లక్షణాలు. ఇలాంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యుడిని సంప్రదించి చికిత్స ప్రారంభించాలని మెంటల్ హెల్త్ హేర్ కడప వైద్యులు వెంకటరాముడు తెలిపారు.



ఈ ఫొటోలోని వ్యక్తి ముద్దనూరు ప్రాంతానికి చెందిన ఎంబీబీఎస్ వైద్యు డు. వయసు 72 సంవత్సరాలు. ఈయన గత కొంతకాలంగా ఈ అల్జీమర్స్ వ్యాధి బారిన పడ్డారు. ఈయన భార్య నర్సింగ్ అధికారిణి. ముగ్గురు సంతానం. ప్రముఖ నగరాల్లో మంచి స్థాయిలో ఉన్నారు. ఈయనకు ఇవేవీ గుర్తు లేక ఇంట్లో నుంచి వెళ్లిపోయి రోడ్ల వెంట తిరుగుతూ భిక్షాటన చేస్తుండేవారు. దీనబంధు అసోసి యేషన్ వారు ఈయనను గుర్తించి తీసుకువచ్చి కడప మెంటల్ హెల్త్ కేర్‌లో చికిత్సను అందిస్తున్నారు. ప్రస్తుతం ఈయన చికిత్సలో పొందుతున్నారు. బాధాకరమైన విషయం ఏంటంటే, ఈయన బ్యాంకు అకౌంటులో సుమారు రూ.20లక్షల పైనే డబ్బులు ఉండడం, అది ఆయనకు తెలియక కాదు గుర్తులేకపోవడమే.



నయం చేయలేం... తీవ్రతను తగ్గించవచ్చు

అల్జీమర్స్ వ్యాధిని పూర్తిగా నయం చేయలేం. 60సంవత్సరాలు దాటిన వారిలో ఇది ఎక్కువగా కనబడుతుంది. ముదిరితే ఏమీ చేయలేం. పై లక్షణాలు ముందుగానే గుర్తించి వైద్యుడిని సంప్రదించాలి. అర్లీ డెమెన్షి యాలో చికిత్సకు అనుకూలంగా ఉంటుంది. ఆహారపు అలవాట్లు, తీసుకునే తిండి, నిద్ర, జీవనశైలిపై ఈ అల్జీమర్స్ వ్యాధి ఆధారపడి ఉంటుంది. సరైన ఆహార నియమాలు, సమతుల్య ఆహారం, నీరు ఎక్కువగా తాగడం, వ్యాయామం, ఆరోగ్యకరమైన జీవనశైలి పాటిస్తే ఈ వ్యాధిని నియంత్రించ వచ్చు. మెదడుకు పదను పెట్టే పనులు, గుర్తుంచుకునే సామర్థ్యాన్ని పెంపొందించే పనులు చేయాలి. చాలా వరకు శారీరక, మానసిక ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి,

- డాక్టర్ వెంకటరాముడు, మెంటల్ హెల్త్‌కేర్, కడప సూపరింటెండెంట్

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



బ్రహ్మంగారిమఠం, సెప్టెంబరు 20: బ్రహ్మంగారిమఠంలోని ఓ బెల్టు షాపు వద్ద సోమిరెడ్డిపల్లె సింహరాయలు (38) అనే వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. చిన్నచిన్న పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న సింహరాయులు మదిరెడ్డిపల్లె గ్రామం నుంచి రోజు వారి లాగానే గురువారం ఉదయం బ్రహ్మంగారిమఠంకు వచ్చారు. రాత్రి తిరిగి ఇంటికి వెళ్ల లేదు. శుక్రవారం తెల్లవారే సరికి బెల్టుషాపు వద్ద శవమై కనపించాడు. ఈ విషయం తెలుసుకున్న మృతుని భార్య, బంధువులు అక్కడికి చేరుకుని బోరున విలపించారు. తన భర్తను హత్య చేశారంటూ మృతుని భార్య విజయమ్మ స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో అనుమానాస్పదస్థితిలో మృతి చెందినట్లు కేసు నమోదు చేసి.. మృతుడు మద్యం తాగి మృతి చెందాడా.. హత్య చేశారా అనే విచారణ చేస్తున్నట్లు మైదుకూరు రూరల్ సీఐ శివశంకర్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బద్వేలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

4 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

సుండుపల్లె, సెప్టెంబరు 20: రాయవరం అటవీ ప్రాంతంలోని ముడుం పాడు బీటు వానుబండ ప్రదేశంలో శుక్రవారం నాలుగు ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని ఒక తమిళ కూలీని అరెస్టు చేసినట్లు సానిపాయి రేంజర్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు తనిఖీలు నిర్వహిస్తుండగా ఒక వాహనం ఆపకుండా వెళ్లడంతో వెంబడించి పట్టుకున్నామని తెలిపారు. ఆ వాహనంలో ఇద్దరు ఉండగా ఒకరు తప్పించుకోగా తమిళనాడు రాష్ట్రం తిరుపత్తూరుకు చెందిన శివకుమార్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నామన్నారు. నాలుగు ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామన్నారు. దుంగలు, వాహనం విలువ దాదాపు రూ.4 లక్షలు ఉంటుందని తెలిపారు. డీఆర్‌వో రమేశ్‌బాబు, ఎఫ్‌బీవోలు అంజనస్వామి, లక్ష్మీప్రసన్న, లీలహరి, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



నారాయణ మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు

చిన్నమండెం, సెప్టెంబరు 20: కడప-బెంగుళూరు జాతీయ రహదారిపై మండలంలోని జల్లావాండ్లపల్లి వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో సుంకర నారాయణ (63) అనే వ్యక్తి మృతి చెందినట్లు ఎస్ఐ సుధాకర్ తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు.. నారాయణ పశువులకు గడ్డి కోసుకొని వచ్చేటందుకు కడప-బెంగుళూరు జాతీయ రహదారిపై నడుచుకుంటూ వెళుతుండగా శుక్రవారం మధ్యాహ్నం గుర్తు తెలియని ఐచర్ వాహనం ఢీకొనడంతో తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఉరివేసుకుని వ్యక్తి మృతి



ఒంటిమిట్ట, సెప్టెంబరు 20: మండల పరిధిలోని కోనరాచపల్లె పంచాయతీ అమ్మవారిపల్లెలో నందుగోపినేని పాపయ్య (35) ఇంటిలో ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ కలహాల నేపథ్యంలో మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నట్లు స్థానికులు తెలిపారు. ఇతనికి ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. సీఐ కృష్ణంరాజు నాయక్, ఎస్ఐ ఎస్.శివప్రసాద్‌లు సంఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించారు. కాగా, మృతుని భార్య తన భర్తను ఎవరో చంపారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

25 ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



వల్లూరు, సెప్టెంబరు 20 : మండల పరిధిలోని పాపాఘ్నినదిలో ఇసుక అక్రమంగా తవ్వకాలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. పోలీసుల నిఘా పెరగడంతో వారు మరో దారి గుండా ఇసుక తరలిస్తున్నారు. దీంతో గురువారం రాత్రి సీఐ రోషన్ ఆధ్వర్యంలో కడప స్పెషల్ బ్రాంచ్ బృందంతో కలిసి దాడులు నిర్వహించి.. దాదాపుగా 25 ట్రాక్టర్లను పట్టుకున్నారు. పట్టుబడిన ఆ ట్రాక్టర్లపై స్థానిక పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఎస్ఐ సంజీవరాయుడు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మూడు ట్రాక్టర్లు, ఎక్స్‌కవేటర్ సీజ్

రాయచోటిటౌన్, సెప్టెంబరు 20: రాయచోటి మున్సిపాలిటీ పరిధిలోని కంచాలమ్మ గండి, చుట్టుపక్కల ప్రాంతాల్లో ఇసుక, మట్టిని అక్రమంగా తరలిస్తున్న మూడు ట్రాక్టర్లు, ఒక ఎక్స్‌కవేటర్ సీజ్ చేసినట్లు అర్బన్ సీఐ చంద్రశేఖర్, ఎస్ఐ నరసింహారెడ్డిలు తెలిపారు. గ్రామస్తుల సమాచారంతో దాడులు చేసి ట్రాక్టర్లను, ఎక్స్‌కవేటర్ సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు తెలియజేశారు.

చెన్నూరు వద్ద...

చెన్నూరు, సెప్టెంబరు 20: మండలంలోని పెన్నానది నుంచి ఇసుక అక్రమ రవాణా చేస్తున్న మూడు ఇసుక ట్రాక్టర్లను శుక్రవారం సీఐ పురుసోత్తంరాజు ఆధ్వర్యంలో పోలీసులు పట్టుకున్నారు. పట్టుబడిన ఇసుక ట్రాక్టర్లు రెండు ట్రాక్టర్లు గుర్రంపాడు సమీపంలోని ఇసుక క్వారీ నుంచి, మరో ట్రాక్టరు బలసింగాయపల్లె పరిధిలోని ఇసుక క్వారీ నుంచి ఇసుక అక్రమ రవణా చేస్తూ పట్టుబడ్డాయన్నారు.

చదువుతో పాటు క్రీడలు ముఖ్యమే.. బీటెక్ రవి



వేంపల్లెలో రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలను ప్రారంభిస్తున్న టీడీపీ ఇన్‌చార్జి మారెడ్డి రవీంద్రనాథరెడ్డి

వేంపల్లె, సెప్టెంబరు 20: చదువుతో పాటు క్రీడలు ముఖ్యమేనని పులివెందుల టీడీపీ ఇన్‌చార్జి మారెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి (బీటెక్ రవి) పేర్కొన్నారు. వేంపల్లెలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ బాలబాలికల హ్యాండ్‌బాల్ పోటీలను పులివెందుల బీటెక్ రవి ప్రారంభించి.. వివిధ జిల్లాల నుంచి హాజరైన హ్యాండ్‌బాల్ క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో బీటెక్ రవి మాట్లాడుతూ కోట్లాది జనాభా ఉన్న భారతదేశానికి ఒలంపిక్‌లాంటి క్రీడల్లో పతకాలు తక్కువగా వస్తుంటాయని, తక్కువ జనాభా ఉన్న దేశాలకు ఒలంపిక్ క్రీడల్లో ఎన్నో పతకాలు వస్తున్నాయని తెలిపారు. మన దేశంలో పిల్లలకు క్రీడలపై ఆసక్తిని పెంపొందించడంలో తల్లిదండ్రులు ముఖ్యభూమికి పోషించాలని.. ఉపాధ్యాయులు చదువుతో పాటు ఆటలు ఆడడం వల్ల కలిగే ప్రయోజనాలను తెలియజెప్పాలన్నారు. అనంతరం హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు బీటెక్ రవిని సత్కరించారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్లు, వివిధ జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులు, హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రతినిదులు, టీడీపీ, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో సులువుగా ఇసుక బుక్ చేసుకోవచ్చు : కలెక్టర్



స్టాక్‌పాయింట్ వద్ద ఉన్నఇసుకను పరిశీలిస్తున్న కలెక్టర్ శివశంకర్, ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి

వీరపునాయునిపల్లె, సెప్టెంబరు 20: ఇసుకను సులువుగా ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకోవచ్చని జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి తెలిపారు. శుక్రవారం మండలంలోని పాపాఘ్నినది సమీపంలో ఉన్న కొత్తపల్లె వద్ద ఉన్న ఇసుక స్టాక్‌పాయింట్‌ను కలెక్టర్‌తో పాటు ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్యరెడ్డిలు పరిశీలించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని అందుబాటులోకి తెచ్చిందన్నారు. ఎవరైనా ఎక్కడి నుంచైనా ఏ సమయంలోనైనా సులువుగా ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవచ్చు అన్నారు. సచివాలయాలకు వెళ్లి యాప్ ద్వారా బుక్ చేసుకుని తర్వాతనే స్టాక్ పాయింట్‌కు వద్దకు వస్తే వీఆర్‌ఓ ద్వారా ఇసుకను లోడింగ్ చేయించుకునే సౌకర్యం ఉందన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐ భగీరథరెడ్డి, రెవిన్యూ అధికారి రాజశేఖర్, మైనింగ్ అధికారులు పాల్గొన్నారు.

ఆరుగురికి జైలుశిక్ష

కలసపాడు, సెప్టెంబరు 20: మండలంలోని దూలంవారిపల్లె గ్రామా నికి చెందిన ఆరుగురికి మూడు సంవత్సరాల జైలుశిక్ష, రూ.500 జరిమానా విధిస్తూ బద్వేలు అడిషనల్ కోర్టు జడ్జి వైజె పద్మశ్రీ శుక్రవారం తీర్పు నిచ్చారు. దూలంవారిపల్లెకు చెందిన పంజగాళ్ల వెంకటలక్ష్మమ్మను సూటిపోటి మాటలతో వేధించడంతో 16.10.2014న విషగుళికలు మింగి ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి చిన్నకుమార్తె పంజగల్ల మల్లేశ్వరి ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ హాజీవలి కేసు నమోదు చేసి దర్యాప్తు పూర్తి చేశారు. ప్రస్తుత కలసపాడు ఎస్ఐ చిరంజీవి కేసు విచారణలో భాగంగా సాక్షులను సకాలంలో కోర్టులో హాజరు పరిచారు. సాక్ష్యాధారాలతో నేరం రుజువైనందున ఆత్మహ త్యకు కారకులైన పంజగల్ల పెద్దవీరమ్మ, పంజగల్ల వీరమ్మ, పంజగల్ల వెంకటసుబ్బమ్మ, వెంకటయ్య, పంజగల్ల వెంకట్రామయ్య, వీరమ్మ లకు మూడేళ్ల జైలు శిక్ష విధించారు. నేరస్తులకు శిక్ష పడేలా కృషి చేసిన అధికారులు సిబ్బందిని ఎస్పీ హర్షవర్ధన్‌రాజు అభినందించారు.

నలుగురు గంజాయి విక్రేతల అరెస్టు

కడప (క్రైం), సెప్టెంబరు 20 : కడప నగరం మాసాపేట హిందూ స్మశాన వాటిక వద్ద గంజాయి విక్రయిస్తున్న నలుగురిని అరెస్టు చేసినట్లు కడప టూటౌన్ సీఐ నాగార్జున తెలిపారు. ఆయన వివరాల మేరకు కడపకు చెందిన షేక్ సమీర్, ఆరిఫ్, కదీర్, లక్ష్మీదేవి గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో కడప ఇన్‌చార్జ్ డీఎస్పీరమాకాంత్ ఆదేశాల మేరకు టూటౌన్ ఎస్ఐ హుసేన్, సిబ్బందితో కలిసి నలుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుండి నాలుగు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని ఈ మేరకు వారిని రిమాండుకు తరలించినట్లు తెలిపారు.

లారీలను నిలిపి చోరీ

ముద్దనూరు సెప్టెంబరు 20:మండల పరిధి ఎర్రగుంట్ల రోడ్డులోని కొత్తపల్లె గ్రామం వద్ద గురువారం తెల్లవారు జామున 12-30 సమయంలో హైవేపై వెళుతున్న లారీలను దొంగలు నిలిపి చోరీకి పాల్పడినట్లు సీఐ దస్తగిరి తెలిపారు. సీఐ వివరాల మేరకు... 9 మంది బైకుల్లో వచ్చి లారీలను నిలిపి చోరీలు చేశారు. రెండు లారీలను అడ్డుకొని బెదిరించి డ్రైవర్ల వద్ద ఉన్న ఒక వెండి ఉంగరం, రూ.20వేలు నగదు, 3సెల్‌ఫోన్‌లు చోరీ చేసినట్లు, లారీ డ్రైవర్ల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

సర్వర్ సమస్యతో నిలిచిపోయిన ఇసుక రవాణా

కొండాపురం, సెప్టెంబరు 20: ప్రభుత్వం కొత్తగా ఆన్‌లైన్ ద్వారా ఇసుక పాలసీ ప్రవేశపెట్టి రెండు రోజులైనా మండలంలో ఇసుక సరఫరా జరగ డం లేదు. సర్వర్ సమస్యవల్ల ఇసుక రవాణా జరగలేదని రెవెన్యూ అధికా రులు తెలిపారు. గత కొన్ని రోజులుగా మండలంలోని ఏటూరు ఇసుక రీచ్‌లోకి గండికోట బ్యాక్‌వాటర్ చేరడంతో ఇసుక రవాణా నిలిపివేశారు. తిరిగి బ్యాక్‌వాటర్ రాని ప్రదేశంలో ఇదే రీచ్ నుంచి ఇసుకను స్టాక్ పాయింట్‌కు చేరవేస్తు న్నారు. గురువారం నుంచి ఇసుక రవాణా జరగాల్సి ఉండగా సర్వర్ సమస్యవల్ల నిలిచిపోయింది. సాంకేతిక నిపుణులు సమ స్యను పరిష్కరిస్తున్నారని శనివారం నుంచి ఇసుక రవాణా జరుగుతుందని రెవిన్యూ అధికారులు తెలిపారు.

ట్రాన్స్‌పోర్టు కార్యాలయాల్లో తనిఖీలు



ప్రొద్దుటూరు, సెప్టెంబరు 20 : గంజాయి అక్రమ రవాణాను అరికట్టడంలో భాగంగా ప్రొద్దుటూరులోని ప్రైవేటు ట్రాన్స్ పోర్ట్ కార్యాలయాల్లో డిస్ట్రిక్ నార్కోటిక్ కంట్రోల్ సెల్ టూటౌన్ పోలీసులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. శుక్రవారం స్థానిక టూటౌన్ పరిధిలోని ట్రాన్స్‌పోర్టు కార్యా లయాల్లో సీఐ యుగంధర్, రమణారెడ్డిల ఆధ్వర్యంలో పార్శి ళ్లను విప్పి పరిశీలించారు. బయటి ప్రాంతాల నుంచి ట్రాన్స్ పోర్టులో గంజాయిని అక్రమంగా రవాణా చేసినా.. సహ కరించినా కఠిన చర్యలు తప్పవని ట్రాన్స్‌పోర్టు నిర్వాహకు లను హెచ్చరించారు. మీ ప్రమేయం లేకుండా అనుమానా స్పద పార్శిల్స్ వచ్చినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆదేశించారు.

పోలీసు స్టేషన్ చేరిన ప్రేమ పంచాయితీ

- న్యాయం చేయాలంటూ యువతి ధర్నా



బంధువులతో కలిసి పెనగలూరు పోలీసుస్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న బాధితురాలు

పెనగలూరు, సెప్టెంబరు 20: పెనగలూరు మండలం ఈటమాపురం గ్రామం రాచపాలెంలో సమీప బంధువులైన కోసలాదేవి లావణ్య, వెంకటసాయి సమీప బంధువులు. వీరిరువురు డిగ్రీ చదువుకునే రోజుల్లోనే ప్రేమించుకున్నారు. కొంతకాలంగా వెంకటసాయి ప్రియురాలితో మాట్లాడకుండా ఏ సమాచారం తెలపకుండా ఉండడంతో దేవి లావణ్యకు అనుమానం వచ్చింది. వెంకటసాయికి పెళ్లి జరుగుతుందని తెలియడంతో మూడు రోజుల కిందట ఆత్మహత్యకు యత్నించింది. దీంతో విషయం తెలిసిన యువతి తల్లి దండ్రులు న్యాయం కోసం పోలీసులను ఆశ్రయించారు. మూడు రోజులుగా ఎస్ఐ రవిప్రకాశ్‌రెడ్డి నాన్పుడు ధోరణితో మాట్లాడుతుండడంతో శుక్రవారం తనకు న్యాయం చేయాలంటూ బంధువులతో కలిసి పెనగలూరు పోలీసుస్టేషన్ ఎదుట ధర్నా చేశారు. దీంతో ఎస్ఐ రవిప్రకాశ్‌రెడ్డి ఈ విషయాన్ని సీఐ దగ్గర మాట్లాడుకోవాలని యువతి బంధువులను రాజంపేట రూరల్ సీఐ దగ్గరకు తీసుకెళ్లారు. కాగా, ఈ సంఘటనపై పెనగలూరు ఎస్ఐని వివరణ కోరగా ఈ సమస్యను సున్నితంగా పరిష్కరించాలని ఇరువురి బంధువులను ఇన్‌స్పెక్టర్ వద్దకు తీసుకెళ్లినట్లు తెలిపారు.

రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు కడప విద్యార్థి



కడప (స్పోర్ట్స్) సెప్టెంబర్ 20: రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-14 ఫుట్‌బాల్ పోటీలకు కడప నగరంలోని నాగార్జున మోడల్ స్కూల్‌కు చెందిన విద్యార్థి మాస్టర్ శశాంక్ డేవిడ్ (ప్రముఖ జ్యోతిష్య నిపుణులు సురేష్‌బాబు కుమారుడు) ఎంపికయ్యారు. ఆ స్కూల్ పీఈటీ సునీల్‌కుమార్ పర్యవేక్షణలో ఫుట్‌బాల్ క్రీడలో శిక్షణ పొందుతున్నారు. కాగా శశాంక్ డేవిడ్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల ఆ స్కూల్ కరస్పాండెంట్ శివశంకర్‌రెడ్డి, డీఎస్‌డీఓ అమృత్‌రాజ్, సెక్రటరీ థామస్ హర్షం వ్యక్తం చేశారు.

నవోదయలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

రాజంపేట, సెప్టెంబరు 20: రాజంపేట జవవహర్ నవోదయ విద్యాల్యయంలో 2025-26 సంవత్సరం ఆరో తరగతిలో ప్రవేశానికి ఈనెల 23వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు రాజంపేట జవహర్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ ఎం.గీత ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులన్నారు. ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలలో ఉమ్మడి కడప జిల్లాలో చదువుకుంటున్న 5వ తరగతి విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

నకిలీ బంగారం పెట్టి రుణాలు పొందిన వ్యక్తుల అరెస్టు

ప్రొద్దుటూరు, సెప్టెంబరు 20: స్టేట్ బ్యాంకులో నకిలీ బంగారం పెట్టి రుణాలు పొందిన కేసులో పాతకోట వెంకటరమణ, బొంతు శివకుమార్, షేక్‌అబ్దుల్ ఖాదర్ అనే ముగ్గురు వ్యక్తులను శుక్రవారం అరెస్టు చేసినట్లు టూటౌన్ సీఐ యుగంధర్ తెలిపారు. ఈమేరకు నిందితులను రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు.

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

రాజంపేట, సెప్టెంబరు 20: ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు 4వ సారి ప్రమాణ స్వీకారం చేసిన వంద రోజుల్లోనే రాష్ట్రం అభివృద్ధి పథంలో పరుగు తీస్తోందని నియోజకవర్గ టీడీపీ నాయకుడు సుగవాసి బాలసుబ్రహ్మణ్యం అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు పూర్తయిన సందర్భంగా శుక్రవారం స్థానిక అన్న కాంటీన్ వద్ద టీడీపీ నేతలు సంబరాలు చేసుకున్నారు. ప్రజలతో ఇది మంచి ప్రభుత్వం అనిపించుకుందంటూ నినదించారు. ఈ సందర్భంగా ఆయన అన్న క్యాంటీన్‌లో పేదలకు భోజనాన్ని వడ్డించారు. అనంతరం మాట్లాడుతూ వృద్ధులకు, వితంతువులకు పింఛను పెంపు, మెగా డీఎస్సీ నోటిఫికేషన్, పంచాయతీలకు నిధులు కేటాయింపు, ఉద్యోగులకు ప్రతినెలా 1నే జీతాలు తదితర కార్యక్రమాలు కేవలం 100 రోజుల్లోనే నిర్వహించడం చంద్రబాబు నాయుడుకే దక్కుతుం దన్నారు. అనంతరం తన్న క్యాంటీన్‌లో పేదలకు భోజనాన్ని వడ్డించా రు ఈ కార్యక్రమాల్లో టీడీపీ రాజంపేట పార్లమెంట్ లీగల్‌సెల్ అధ్య క్షుడు టి.లక్ష్మీనారాయణ, వెంకటేశ్వర్లునాయుడు, దంతవైద్యుడు నవీన్ కుమార్, లక్ష్మీనరసయ్య, టైల్స్ నరసింహ, జనసేన నాయకులు అబ్బిగారి గోపాల్, అగ్రహారం నాయకులు సుధాకర్, మండల టీడీపీ నాయకుడు గన్నే సుబ్బనరసయ్య నాయుడు, రాజంపేట కార్య నిర్వాహక కార్యదర్శి నాగముని రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజంపేటలోని క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో రాజంపేట పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన 100 రోజుల్లోనే అభివృద్ధి కార్యక్రమాలే చంద్రబాబు పరిపాలన తీరు, ముందు చూపునకు నిదర్శనమన్నారు. విజయవాడలో వరద బాధితులను ఆదుకోవడంలో సీఎం చంద్రబాబు పడ్డ కష్టం రాష్ట్ర ప్రజలు మరచిపోలేదన్నారు. రాజంపేట పట్టణ టీడీపీ అధ్యక్షుడు సుబ్రమణ్యం నాయుడు, కల్లుగీత రాష్ట్ర కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ కొమరా వెంకటనరసయ్య, పార్లమెంట్ కార్యదర్శి సుబ్రమణ్యం నాయుడుతో పాటు, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

బాబు హయాంలో ప్రగతిపథంలో రాష్ట్రం

కూటమి ప్రభుత్వానికి వంద రోజులు పూర్తయిన సందర్భంగా 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో నేతలు


రాజంపేట: పేదలకు అన్నం వడ్డిస్తున్న సుగవాసి బాలసుబ్రమణ్యం


చిన్నమండెం: అర్జీలు స్వీకరిస్తున్న మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : డాక్టర్ లక్ష్మీప్రసాద్‌రెడ్డి

చిన్నమండెం, సెప్టెంబరు 20: కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తయిన సందర్భంగా మండలంలోని సచివాలయం-2లో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సోదరుడు డాక్టర్ మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా చంద్రబాబు నాయుడు వంద రోజుల్లోనే పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వంద రోజుల్లో సాధించిన విజయాలు, ప్రగతిని రాష్ట్ర ప్రజలకు తెలియజేసేందుకు ప్రజా దర్బార్ నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్నామన్నారు. గతంలో ఉద్యోగాలు లేక ఎంతో మంది నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకున్న పరిస్థితులు ఉన్నాయని, కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మెగా డీఎస్సీ ద్వారా 16,437 టీచర్ పోస్టులు భర్తీ చేసి నిరుద్యోగ సమస్యను నివారించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో దివ్య, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రామ సభలు

సంబేపల్లె: ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తయిన సందర్భంగా ఇది మంచి ప్రభుత్వం గ్రామ సభలు నేటి నుంచి 26వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సునీల్‌కుమార్ తెలిపారు. సంబేపల్లెలో 21వ తేదీ శనివారం గ్రామసభ నిర్వహించనున్నట్లు తెలిపారు. 23వ తేదీ రౌతుకుంట, నారాయణరెడ్డిపల్లె, మోటకట్ల గ్రామాల్లో 24న దేవపట్ల, నాగిరెడ్డిగారిపల్లె. 25న గుట్టపల్లి1, గుట్టపల్లి 2, గున్నికుంట్ల, 26వ తేదీ దుద్యాల, శెట్టిపల్లె, గున్నికుంట్లలో సభలు నిర్వహించనున్నట్లు తెలియజేశారు. ఆయా గ్రామాలకు సంబంధించిన వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజలు సచివాలయ సిబ్బంది హాజరవుతారని తెలిపారు. ఈ సభల్లో ప్రభుత్వం వంద రోజుల్లో అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలపై వివరించనున్నట్లు తెలిపారు.

'జమిలి'పై టీడీపీ, వైసీపీ వైఖరి వెల్లడించాలి: సీపీఐ

రాయచోటిటౌన్, సెప్టెంబరు 20: జమిలి ఎన్నికలను ఐక్యంగా తిప్పికొడదామని అన్నమయ్య జిల్లా సీపీఐ కార్యదర్శి పీఎల్ నరసింహులు పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన స్థానిక సీపీఐ జిల్లా కార్యాలయంలో నిర్వహించి పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడారు. జమిలి ఎన్నికల విధానం దేశంలోని ఫెడరల్ వ్యవస్థకు విఘాతం కలిగిస్తుందన్నారు. దేశంలో విభిన్న జాతులు కులాలు, మతాలున్నందునే ఫెడరల్ వ్యవస్థను తెచ్చారన్నారు. రాష్ట్రాల్లో ఒకవేళ ప్రభుత్వాలు కూలినా వెంటనే ఎన్నికలు జరిపే పరిస్థితి ఉండబోదన్నారు. పెద్దనోట్ల రద్దుతో నల్లధనం పోతుందని చెప్పారని, ఇప్పుడు జరుగుతున్న ఎన్నికల్లో ఎన్ని కోట్ల రూపాయలు ఖర్చు పెడుతున్నారో తెలియదా అని ఆయన ప్రశ్నించారు. ఐదేళ్లలో నిరుద్యోగం, ధరలు పెరిగాయని, వాటిని నియత్రించడానికి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నం చేయాలని డిమాండ్ చేశారు. నష్టదాయకమైన జమిలి ఎన్నికలపై టీడీపీ, వైసీపీ తమ వైఖరిని వెల్లడించాలని డిమాండ్ చేశారు. జమిలి ఎన్నికలతో ప్రాంతీయ పార్టీల మనుగడకు నష్టం కలుగుతుందని తెలిసినా మోడీ భయంతో ఈ రెండు పార్టీలు మౌనంగా ఉన్నాయన్నారు. వాస్తవానికి దేశంలో బీజేపీ, జేడీయూ తప్ప ఎవరూ అంగీకరించలేదన్నారు. 50 శాతానికి పైగా జనాభాకు ప్రతినిధ్యం వహించే పార్టీలు ఈ విధానాన్ని వ్యతిరేకిస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సాంబశివ, సిద్దిగాళ్ల శ్రీనివాసులు, సుధీర్‌కుమార్, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు ముందస్తు చర్యలు

సంబేపల్లె, సెప్టెంబరు 20: దోమల నివారణ కోసం సం బేపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని పెద్ద జంగం పల్లి, నాయునివారిపల్లెలో వై ద్య సిబ్బంది సైనోఫైరెత్రియం స్ప్రే చేశారు. గ్రామాల్లో లార్వాలను గుర్తించి నాశనం చేశారు. పరిసరాలను పరిశు భ్రంగా ఉంచుకోవాలని ప్రజ లకు తెలియజేశారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే వ్యాధులు రావని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాయచోటి సబ్ యూనిట్ అధికారులు ప్రసాద్ యాదవ్, జయరామయ్య, సీహెచ్‌వో రాణి, పీహెచ్ఎన్ పూర్ణమ్మ, సూపర్‌వైజర్ సదాశివారెడ్డి, కృష్ణవేణి, హెల్త్ అసిస్టెంట్ రవిశంకర్, ఎంఎల్‌హెచ్‌పీ శబ్రీన్, ఏఎన్ఎం విజయదుర్గ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలపై మంత్రి నారా లోకేష్‌కు వినతి

రైల్వేకోడూరు, సెప్టెంబరు 20: విద్యార్థుల సమస్యలన్ను రాయలసీమ విద్యార్థి పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు మల్లెం హేమంత్ శుక్రవారం విజయవాడలో రాష్ట్ర విద్యాశాఖ, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌కు విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రైవేటు, కార్పొరేటు విద్యా సంస్థలు, పెద్ద మొత్తంలో ఫీజులు వసూలు చేస్తుండడంతో పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు విద్యకు దూరమవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్పొరేట్ పాఠశాలలను కనీస విద్యార్హత లేని సిబ్బందితో నడుపుతున్నారని తెలిపారు. విద్యాశాఖ అధికారులు, విద్యా సంస్థలు కుమ్మక్కై విద్యా వ్యవస్థను నాశనం చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. విద్యా వ్యవస్థ పరిరక్షణకు కృషి చేయాలని నారా లోకేష్‌కు విన్నంచగా, ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు.

మంత్రి నారా లోకేశ్‌కు వీడ్కోలు


రేణిగుంట విమానాశ్రయంలో మంత్రి నారా లోకేశ్‌కు వీడ్కోలు పలుకుతున్న మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటిటౌన్, సెప్టెంబరు 20: చిత్తూరు జిల్లా పర్యటనను ముగించుకుని శుక్రవారం సాయంత్రం రేణిగుంట విమానాశ్రయం చేరుకున్న రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, ఆర్టీజీ, మానవ వనరులశాఖ మంత్రి నారా లోకేశ్‌కు సాదర వీడ్కోలు లభించింది. రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డితో పాటు సహకర ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు వీడ్కోలు పలికారు.

మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ : డ్వామా పీడీ

రైల్వేకోడూరు, సెప్టెంబరు 20: ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని డ్వామా పీడీ ఎంసీ మద్దిలేటి సూచించారు. శుక్రవారం రైల్వేకోడూరు పంచాయతీ పరిధిలోని కొత్తకోడూరులో స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ప్రతి ఇంటి ముందు మొక్కలు నాటితే పర్యావరణ పరిరక్షణ జరుగుతుందన్నారు. కాలుష్యం నుంచి ప్రజలు బయటపడతారని తెలిపారు. మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించాలన్నారు. దీంతో మానవ జీవన ప్రమాణాలు మెరుగుపడతాయన్నారు. ఉపాధి ఏపీడీ ప్రసాద్ రావు, ఎంపీడీవో జాషువా, స్థానిక కూటమి నాయకులు పాల్గొన్నారు.


కొత్తకోడూరులో మొక్కలు నాటుతున్న డ్వామా పీడీ మద్దిలేటి

లక్కిరెడ్డిపల్లె: స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఎంపీడీవో వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. జడ్పీ హైస్కూల్ హెచ్ఎం వెంకటేశ్వరులు, మద్దిరేవుల సర్పంచు, చంద్రమ్మ, పంచాయతీ కార్యదర్శులు సుదర్శన్ రెడ్డి, రజనీష్‌రెడ్డి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు

సంబేపల్లె: మండలంలోని బాలయోగి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఎంపీడీవో సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో ఉపాధి హామీ పథకం కింద మొక్కలు నాటారు. పంచాయతీ సెక్రటరీ రవీంద్ర, ఏపీఎం రెడ్డిజవహర్ తదితరులు పాల్గొన్నారు.

రామాపురం: నీలకంఠ్రావుపేట సచివాలయం, జడ్పీ హైస్కూల్ ఆవరణలో ఉపసర్పంచ్ మహబూబ్‌బాషా ఉపసర్పంచ్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు సుజాత మ్మ, పీడీ నరేంద్ర కుమార్‌రెడ్డి, సచివాలయ కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, టీడీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు రూ. 50 వేలు విరాళం


ముఖ్యమంత్రికి చెక్కును అందిస్తున్న లారీ సుబ్బరాయుడు తదితరులు

చిట్వేలి, సెప్టెంబరు 20: విజయవాడలోని వరద బాధితుల సహాయార్థం గురువారం రాత్రి రూ. 50 వేలు విరాళం అందజేసినట్లు మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు లారీ సుబ్బరాయుడు తెలిపారు. విజయవాడలోని రాష్ట్ర పరిపాలన భవనంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును కలిసి ఇందుకు సంబంధించిన చెక్కును అందజేసినట్లు వివరించారు. సీనియర్ నాయకులు బాలు రామాంజనేయులు, కాటూ రి నరసింహులు, వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మ ఆలయ హుండీ లెక్కింపు

లక్కిరెడ్డిపల్లె సెప్టెంబరు 20: అనంతపురం గ్రామంలోని గంగమ్మ ఆలయానికి హుండీలోని కానుకల ద్వారా 1,65,085 రూపాయలు ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి మారుతి ప్రసాదు తెలిపారు. దేవదాయ, ధర్మాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ జనార్దన్ అధ్యక్షతన శుక్రవారం హుండీ లెక్కించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్ మురికినాటి రెడ్డెయ్య, జేఆర్ మధుసూదన్ రెడ్డి , మార్కండేయ, రమ్య, నారాయణ తదితరులు పాల్గొన్నారు

తాగునీటి సమస్య పరిష్కరించాలి

ఓబులవారిపల్లె, సెప్టెంబరు 20 : మండల పరిధిలోని వై.కోట గ్రామ పంచాయతి పరిధిలో ఉన్న రాములమ్మ కాలనీ వాసుల సమస్యలు తీర్చాలని సీపీఐ మండల కార్యదర్శి నాగమ్మ డిమాండ్ చేశారు. వీధి దీపాలు పనిచేయక, తాగునీరు సక్రమంగా అందక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సర్పంచ్, మండల అధికారులు సమస్యలు పరిష్కరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

క్రీడా కోర్టు నిర్మాణానికి విరాళం

పెనగలూరు, సెప్టెంబరు 20 : మండల కేంద్రంలోని ఎంఈవో కార్యాలయ ప్రాంగణంలో షటిల్ బ్యాడ్మింటన్ కోర్టు నిర్మాణానికి తలమంచి గిరీష్‌రెడ్డి చారిటబుల్ ట్రస్టు రూ. 50 వేలు విరాళం ఇచ్చినట్లు గిరీష్‌రెడ్డి ప్రతినిధి ఆకుల చిన్నా తెలిపారు. శుక్రవారం క్రీడా కోర్టు నిర్మాణ స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా క్రీడాకారులు మాట్లాడుతూ విద్యార్థులను రాష్ట్రస్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని తెలిపారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి


జాబ్‌మేళాలో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ నిధియాదేవి

రాజంపేట టౌన్, సెప్టెంబరు 20 : యువత చిత్తశుద్ధితో కృషి చేస్తే ఎంతటి కష్టమైన పనైనా విజయవంతం అవుతుందని రాజంపేట సబ్ కలెక్టర్ వైఖోమ్ నిధియాదేవి అన్నారు. శుక్రవారం రాజంపేట ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళాలో ఆమె మాట్లాడారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో స్కిల్ డెవలప్‌మెంటు సెంటర్లను ఏర్పాటు చేశామన్నారు. అక్కడ వెళ్లి నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. ఉద్యోగం చిన్నదా పెద్దదా అనే ఆలోచనకంటే ముందు జీవితంలో స్థిరపడాలనే లక్ష్యం ఉండాలన్నారు. ఈ జాబ్‌మేళాకు 367 మంది హాజరు కాగా 108 మంది ఉద్యోగాలు సాధించారు. ఎంపికైన వారికి నియామక పత్రాలు అందజేశామని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి హరికృష్ణ తెలిపారు. ఈ జాబ్‌మేళాలో కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్, డోనప్ప, జేఈవో వేణుమాధవ్, జేడీఎం, వివిధ కంపెనీల ప్రతినిధులు, అధికారులుపాల్గొన్నారు.

అన్నమాచార్యలో యోగాపై శిక్షణ తరగతులు

రాజంపేట టౌన్, సెప్టెంబరు 20 : స్థానిక అన్నమాచార్య యూనివర్శిటీలో శుక్రవారం యోగా, బ్రీతింగ్‌పై శిక్షణ తరగతులు నిర్వహించారు. బెంగుళూరు ఆటా ఫ్లివింగ్ సంస్థకు చెందిన డాక్టర్ శరత్, టీమ్‌లీడర్ అభిషేక్, శరత్‌చంద్ర, డాక్టర్ అనసూయ, రవిచంద్ర, స్నేష్, అరుణ, బాలాజీలు శిక్షణ తరగతులు నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ఎంవి నారాయణ, యూనివర్శిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎన్.మల్లికార్జునరావు, డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్ డాక్టర్ ఎం.సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలలో సమస్యలు పరిష్కరించాలి

పుల్లంపేట, సెప్టెంబరు 20 : ఆదర్శ పాఠశాలలో సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి బాలసుబ్రమణ్యం ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఆదర్శ పాఠశాలను పరిశీలించారు..

మాజీ సీఎంపై దుష్ప్రచారం తగదు

రాయచోటిటౌన్, సెప్టెంబరు 20: విషప్రచార మే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని, తాజా గా తిరుమల లడ్డు పేరుతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ముఖ్యమంత్రి విషప్రచారం చేయడం విస్మయానికి గురిచేస్తోందని వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే రమేశ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన రాయచోటి పట్టణంలోని వైసీపీ అన్నమయ్య జిల్లా కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. శిబ్యాల విజ యభాస్కర్, సుగవాసి శ్యాంకుమార్, కలీం పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం ప్రారంభించాలి

వీరబల్లి, సెప్టెంబరు 20: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ ప్రగతిశీల విద్యార్థి యువజన సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం వీరబల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ఆందోళన చేశారు. ఈ సందర్భంగా పీఆర్ఎస్‌వైఎఫ్ రాష్ట్ర నాయకుడు ఓరుగంటి నాగేంద్రబాబు, అన్నమయ్య జిల్లా కన్వీనర్ వెంకట్రమణ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో మధ్యాహ్న భోజన పథకాన్ని ఆపేయడంతో విద్యారులు ఇబ్బందులు పడ్డారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి విద్యార్థుల సంక్షేమానికి తోడ్పాటును ఇవ్వాలని కోరారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం

పుల్లంపేట, సెప్టెంబరు 20 : జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన ఆర్.ఉప్పరపల్లె ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు శ్రీపాల ఉమామహేష్‌ను స్థానిక సభ జూనియర్ కళాశాలలో శుక్రవారం సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసులరెడ్డి, కరస్పాండెంట్ నూకల శ్రీరాములు శాలువా కప్పి పూలమాల వేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజు, ఉపాధ్యాయులు నరేంద్రనాథ్, రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఏడుగురు జూదరుల అరెస్ట్

సుండుపల్లె, సెప్టెంబరు 20: మండల కేంద్రానికి సమీపంలోని పెద్దమాదిగపల్లి వద్ద పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు శుక్రవారం తెలిపారు. వారి నుంచి రూ.12,080 నగదు, ఐదు మోటారు సైకిళ్లు, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

నేడు ప్రజాదర్బార్

ఓబులవారిపల్లె, సెప్టెంబరు 20: మండలంలోని ముక్కావారిపల్లె టీడీపీ కల్యాణ మండ పంలో శనివారం రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ ఆధ్వర్యంలో ప్రజాదర్బార్ నిర్వహి స్తున్నట్లు ఎంపీడీవో విజయరావు తెలి పారు. ఈ ప్రజాదర్బార్‌లో ప్రజా సమస్యలకు సంబంధించిన అర్జీలు స్వీకరిస్తారని వివరించారు.

గురుకులాల్లో సిబ్బందిని నియమించండి

రైల్వేకోడూరు(రూరల్) సెప్టెంబరు 20: వంట సిబ్బంది లేక విద్యార్థులకు సకాలంలో భోజనం వడ్డించ లేకున్నామని గురుకుల పాఠశాల సిబ్బంది తమ సమస్యలను ఎస్టీ కమిషన్ చైర్మన్ శంకర్ నాయక్ దృష్టికి తీసుకెళ్లారు. శుక్రవారం ఆయన గురుకుల పాఠశాలను తనిఖీ చేశారు. మౌలిక వసతులపై ఆరా తీశారు. ప్రతి తరగతికి వెళ్లి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గదులు, వంటశాల, మరుగుదొడ్లను పరిశీలించారు. అన్ని గదుల్లో ఫ్యాన్లు, లైట్లు పని చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వైద్య సదుపాయంపై ఆరా తీశారు. ఇటీవల కాలంలో మీడియాలో వచ్చిన అభియోగాలపై వివరణ అడిగి తెలుసుకున్నారు. వంట సిబ్బంది లేకపోవడంతో ఉపాధ్యాయులు వంట చేస్తుంటే స్వచ్ఛందంగా సహాయ సహకారాలు అందించామని విద్యార్థులు చైర్మన్‌కు వివరించారు. పాఠశాలలో సీసీ కెమెరాలను, రికార్డులను పరిశీలించారు. గురుకుల పాఠశాలలో ఉండే సమస్యలను అధికారులు, రాష్ట్ర నాయకుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ రెడ్డి ప్రసాద్, ప్రధానోపాధ్యాయురాలు లత, గురుకుల వార్డెన్ గీత, హౌసింగ్ అధికారి మురళీకృష్ణ, వ్యవసాయ శాఖ అధికారి సుధాకర్, రైల్వేకోడూరు ఎస్ఐ నవీన్ బాబు, ఆర్ఐ రాజశేఖర్, వీఆర్వో తులసి, గురుకుల సిబ్బంది, జడ్పీటీసీ రత్నమ్మ, జనసేన నాయకులు మర్రెడ్డి ప్రసాద్ పాల్గొన్నారు.


విద్యార్థినులతో మాట్లాడుతున్న శంకర్ నాయక్

రక్తదాన శిబిరం


రక్తదాన శిబిరంలో ప్రసంగిస్తున్న రాజంపేట పార్లమెంట్ బీజేపీ అధ్యక్షుడు సాయిలోకేష్

రాజంపేట, సెప్టెంబరు 20 : రక్తదానం ఎంతో గొప్పదని రాజంపేట పార్లమెంట్ బీజేపీ అధ్యక్షుడు సాయిలోకేష్ తెలిపారు. స్వచ్ఛత హి సేవా పక్షోత్సవాల్లో భాగంగా రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రిలో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోతుగుంట రమేష్ నాయుడు, పక్షోత్సవాల కోఆర్డినేటర్ కృష్ణయాదవ్, సురేష్‌రాజు మహిళా మోర్చా అధ్యక్షురాలు సునీత నారాయణవర్మ తదితరులు పాల్గొన్నారు.

బాలికల ఉన్నత పాఠశాలలో స్కౌట్‌పై శిక్షణ

రాజంపేట, సెప్టెంబరు 20 : స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం స్కౌట్, గైడ్స్ జిల్లా కార్యదర్శి మడితాటి నరసింహారెడ్డి విద్యార్థినులకు శిక్షణ ఇచ్చారు. స్కౌట్ యూనిట్స్ ఉన్న ప్రతి పాఠశాలలో ముఖద్వారం వద్ద స్కౌట్ పేరుతో ప్రత్యేక బోర్డును ఏర్పాటు చేయాలన్నారు. బాల బాలికలకు ప్రత్యేక స్కౌట్స్ గైడ్స్ ఏర్పాటు చేయాలన్నారు. రెండేళ్ల శిక్షణ ఉంటుందని, ఉచిత భోజన వసతి కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఓపెన్‌స్కూల్ కోఆర్డినేటర్ శ్రీనివాసరాజు, పుల్లంపేట ఎంఈవో చక్రధర్‌రాజు, ప్రధానోపాధ్యాయురాలు జయలక్ష్మి, లక్ష్మీకర్, వీరప్రకాష్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్కౌట్స్ గైడ్స్ శిక్షణ కార్యక్రమాల కరపత్రాన్ని ఆవిష్కరించారు.

జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం ప్రారంభించాలి

వీరబల్లి, సెప్టెంబరు 20: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ ప్రగతిశీల విద్యార్థి యువజన సంఘం (పీఆర్ఎస్‌వైఎఫ్) ఆధ్వర్యంలో శుక్రవారం వీరబల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ఆందోళన చేశారు. ఈ సందర్భంగా పీఆర్ఎస్‌వైఎఫ్ రాష్ట్ర నాయకుడు ఓరుగంటి నాగేంద్రబాబు, అన్నమయ్య జిల్లా కన్వీనర్ వెంకట్రమణ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో మధ్యాహ్న భోజన పథకాన్ని ఆపేయడంతో విద్యారులు ఇబ్బందులు పడ్డారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి విద్యార్థుల సంక్షేమానికి తోడ్పాటును ఇవ్వాలని కోరారు. లేని పక్షంలో ఆందోళనలను ఉధృతం చేస్తామని వారు తెలిపారు.

తిరుమల లడ్డు అపవిత్రంపై ఆగ్రహం

లక్కిరెడ్డిపల్లె సెప్టంబరు 20: పవిత్రమైన తిరుమల ప్రసాదాన్ని భ్రష్టు పట్టించిన వారిని కఠినంగా శిక్షించాలని విశ్వహిందూ పరిషత్ ధార్మిక నాయకుడు రామకృష్ణయ్య, బీజేపీ నాయకుడు కృష్ణయ్య కోరారు. శుక్రవారం స్థానిక వెంకటేశ్వర దేవస్థానంలో ఆలయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పవిత్రమైన తిరుమల కొండపై అన్యమతస్తులకు పరిపాలన అప్పగించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కడియాల వెంకట సూర్య ప్రసాదు, కోశాధికారి యనమల విశ్వనాథ, ఆర్ఎస్ఎస్ అనంతరెడ్డి, ఎలమంద వెంకటరమణ, పసుపులేటి వెంకటరమణయ్య, నూకల రవీంద్ర, గంగిశెట్టి, రవీంద్రారెడ్డి, వెంకటకృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ ఎడ్యుకేషన్ సదస్సులో అభిషేక్‌రెడ్డి

రాజంపేట, సెప్టెంబరు 20 : ఫ్రాన్స్ దేశంలోని టులౌస్ నగరంలో యూరోపియన్ అసోసియేషన్ అంతర్జాతీయ ఎడ్యుకేషన్ సదస్సుకు రాజంపేట అన్నమాచార్య విశ్వవిద్యాలయ ప్రొ. చాన్సలర్ అభిషేక్‌రెడ్డి పాల్గొన్నారు. విద్యారంగంలో అంతర్జాతీయకరణ, నిపుణుల అవగాహన, నెట్‌వర్కింగ్, అంతర్జాతీయ విద్యా సంస్థల అనుభవాలు తదితర అంశాలపై 18, 19 తేదీల్లో జరిగిన ఈ సదస్సులో తాను పాల్గొనడం ఆనందంగా ఉందని అభిషేక్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా విద్యా రంగానికి అన్నమాచార్య యూనివర్సిటీ ద్వారా ఆయన చేస్తున్న కృషిని అభినందిస్తూ అభిషేక్‌రెడ్డికి ప్రత్యేక ప్రోత్సాహక సర్టిఫికెట్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

ఒంటిమిట్ట, సెప్టెంబరు 20 : చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని, అప్పుడే విద్యార్థి భవి ష్యత్ ఉజ్వలంగా ఉంటుందని ఎంఈవో వెంకటసుబ్బయ్య తెలిపా రు. కొత్త మాధవరం జిల్లా పరి షత్ హైస్కూల్‌లో శుక్రవారం స్కూల్ గేమ్స్ ఎంపికలు నిర్వహిం చారు. చెస్, బ్యాడ్మింటన్, యోగా, వాలీబాల్ క్రీడల్లో పోటీలను నిర్వహించి మండల స్థాయి జట్టును ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలం లోని మిగతా పాఠశాలలతో పోలిస్తే కొత్తమాధవరం విద్యార్థులు క్రీడల్లోనూ రాణిస్తు న్నారన్నారు. క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలను ప్రారంభించారు. ఇన్‌చార్జి హెడ్మాస్టర్ శివప్రసాద్, పీడీ జిలానిబాషా తదితరులు పాల్గొన్నారు.

టంగుటూరు సర్పంచ్ టీడీపీలో చేరిక


టీడీపీలో చేరిన మైనుద్దీన్‌ను అభినందిస్తున్న మేడా విజయశేఖర్ రెడ్డి

నందలూరు, సెప్టెంబరు 20 మండలంలోని టంగుటూరు గ్రామ పంచాయతీ సర్పంచ్ మైనుద్దీన్ దాదాపు వంద కుటుంబాలతో టీడీపీ రాష్ట అధికార ప్రతినిధి మేడా విజయశేఖర్‌రెడ్డి సమక్షంలో తెలుగుదేశంపార్టీలో చేరారు. ఈ సందర్భంగా మైనుద్దీన్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ ఆశయాలు నచ్చి టీడీపీలో చేరానని, టంగుటూరు గ్రామంలో తెలుగుదేశంపార్టీ బలోపేతా నికి తమవంతు కృషి చేస్తానని తెలిపారు. అనంతరం మేడా విజయశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారంలోకి రాగానే పింఛను పెంచుతామన్న హామీని నిలబెట్టుకున్నారని, వలంటీర్లు లేకపోయినా ప్రతినెలా ఒకటో తేదీన పింఛన్లు ఇంటివద్దే అందజేస్తున్నారన్నారు. 16 వేల పోస్టులతో మెగా డీఎస్సీ విడుదలైందని, ల్యాండ్ టైటిలింగ్ యాక్టును రద్దు చేసి రైతుల భయాన్ని పోగొట్టారని తెలిపారు. ఈ కార్యక్రమంలో భువనబోయిన లక్ష్మీనరసయ్య, టంగుటూరు ఎంపీటీసీ సభ్యుడు పెంచలయ్య, మండల టీడీపీ అధ్యక్షురాలు షర్మిల, ఏపీ ఎంఆర్‌పీఎస్ జిల్లా కార్యదర్శి కొండయ్య, లేబాక సర్పంచ్ నరసయ్య, హరి, మదనమోహనపురం చుక్కా యానాది, ఆడపూరు బాబురాజు, కుంపిణీపురం చంద్రశేఖర్, వెంకటసుబ్బారెడ్డి, ఎల్లమరాజుపల్లె శ్రీనివాసులరెడ్డి, గుగ్గిళ్ల సుబ్బరాయుడు, చుక్కా కొండయ్య, వెంకటేశ్, వెంకటరత్నం, తోట కృష్ణయ్య పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ చిన్నారి మృతి

రైల్వేకోడూరు, సెప్టెంబరు 20: వేడిగా ఉన్న పప్పు పాత్రలో పడి ఈనెల 8న తీవ్రంగా గాయపడిన చిన్నారి లాస్య (4) వేలూరు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది...ఈ నెల 8న రైల్వేకోడూరుకు చెందిన కొక్కంటి మహేష్, భార్య వరలక్ష్మి, పాప లాస్య పట్టణంలోని న్యూకృష్ణానగర్‌లో పాప తాత కర్మక్రియలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా సిద్ధం చేసిన పప్పు పాత్రలో ప్రమాదవశాత్తూ లాస్య పడిపోయి తీవ్రంగా గాయపడింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని హెడ్ కానిస్టేబుల్ విజయ్‌కుమార్ తెలిపారు.


మృతి చెందిన లాస్య





కోటూరు వద్ద జరిగిన ప్రజా వేదికపై గ్రామస్తులు, నాయకులు, అధికారులతో కలిసి కూర్చొన్న మంత్రి లోకేశ్

డబుల్ ఇంజన్ ప్రభుత్వంతో మరింత మేలు

ప్రజావేదికలో గ్రామస్తుల ప్రశ్నలు.. మంత్రి లోకేశ్ సమాధానాలు

చిత్తూరు, ఆంధ్రజ్యోతి/ బంగారుపాళ్యం, సెప్టెంబరు 20: బంగారుపాళ్యం మండలం ఎన్.కోటూరు గ్రామంలో నిర్వహించిన ప్రజావేదిక కార్యక్రమంలో గ్రామస్తులు మంత్రి లోకేశ్‌ని అడిగిన ప్రశ్నలు, ఆయన చెప్పిన సమాధానాలిలా..



? డయాలసిస్ కేంద్రం ఏర్పాటుతో పాదయాత్రలో ఇచ్చిన తొలి హామీ అమలు చేశారు. జిల్లాలో ఇచ్చిన మిగిలిన హామీలను కూడా అమలు చేస్తారా
- వీరరాఘవులు నాయుడు, సదకుప్పం, బంగారుపాళ్యం మండలం

లోకేశ్: తొలి హామీ డయాలసిస్ కేంద్రం ఏర్పాటుతో ఈ ప్రాంత బాధితులకు చాలా మందికి మేలు కలగనుంది. ఇదే తరహాలో పాదయాత్రలో ఇచ్చిన అన్ని హామీలను కచ్చితంగా అమలు చేస్తాను.



? ఏటా జాబ్ క్యాలెండర్ అన్నారు. మొదటిది ఎప్పుడు ఇస్తారు. అసలు 20 లక్షల ప్రైవేటు ఉద్యోగాలు ఇస్తామన్నది సాధ్యమా
- వైష్ణవి, బంగారుపాళ్యం

లోకేశ్: జాబ్ క్యాలెండర్ హామీకి కట్టుబడి ఉన్నాం. చంద్రబాబు సీఎం అయ్యాక మెగా డీఎస్సీపైనే తొలి సంతకం పెట్టారు. జనవరిలో ఖాళీల వివరాలు చెప్తాం. ఐదేళ్లలో పెండింగ్ పోస్టులన్నీ భర్తీ చేస్తాం. అలాగే, ఇప్పుడు మన సీఎంపై నమ్మకంతో బడా పారిశ్రామికవేత్తలు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్నారు. ఇప్పుడు మనం పక్క రాష్ట్రాలకు ఉపాధి కోసం వెళుతున్నాం. భవిష్యత్తులో పొరుగు రాష్ట్రాల నుంచి ఉపాధి కోసం మన వద్దకు వచ్చే పరిస్థితి ఏర్పడుతుంది.



? కాదంబరి జెత్వానీ విషయంలో వైసీపీ అన్యాయం చేసింది. తెర ముందు ఉన్నవారితోపాటు తెర వెనుక ఉన్నవారిని కూడా శిక్షిస్తారా. ఆనాడు మహిళలకు అండగా ఉంటానన్నారు కదా?
- గ్రీష్మ, బంగారుపాళ్యం

లోకేశ్: అప్పుడూ చట్టాలున్నాయి. వాటిని ఉల్లంఘించి, దొంగ కేసులు పెట్టి ఓ అక్కను ఇబ్బంది పెట్టారు. ఫలితంగా ముగ్గురు ఐపీఎస్‌లు సస్పెండ్ అయ్యారు. అలాంటి అక్రమాలు చేసిన అధికారుల వివరాలు నా బుక్‌లో ఉన్నాయి. అసలు మహిళల్ని గౌరవించేలా విద్యార్థులకు నరనరాల్లో ఎక్కించేలా సిలబస్ ఉండాలి. చేస్తాం.



? జిల్లాకు ఎలాంటి పరిశ్రమలు తెస్తారు. ఉపాధి కోసం బయటికి రాష్ట్రాలకు వెళ్లేవారికి మీరేం చెప్తారు
- వరుణ్, కాణిపాకం

లోకేశ్: 2014-19 మధ్యలో చంద్రబాబు తిరుపతి, రేణిగుంట, ఏర్పేడు ప్రాంతాల్లో పెద్దఎత్తున ఎలక్ట్రానిక్స్ పరిశ్రమలు తెచ్చారు. అవన్నీ ఇప్పుడు విజయవంతంగా నడుస్తున్నాయి. గత ప్రభుత్వం తీరుతో మనకు పరిశ్రమలు రాలేదు. పీఎం మోదీ కూడా మన రాష్ట్రంపై దృష్టి పెట్టారు. పెట్టుబడుల్ని చంద్రబాబుతోపాటు ఆయన కూడా ప్రోత్సహిస్తున్నారు. డబుల్ ఇంజిన్ ప్రభుత్వం కాబట్టి మరింత మేలు జరగనుంది. ● నాకు ఏడాది టైమ్ ఇవ్వు. పొరుగు రాష్ట్రాల ప్రజలు ఉపాధి కోసం మన వద్దకు వచ్చేలా చేస్తాను.



? డయాలసిస్ బాధితులు మండలాల నుంచి కేంద్రానికి వచ్చేలా 108 ఏర్పాటు చేయండి
- భానుమతి, పూతలపట్టు మండలం

లోకేశ్: 108, 104 వాహనాల విషయంగా ఇప్పటికే ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌తో మాట్లాడాను. జగన్ తన బినామీలకు అంబులెన్సు కాంట్రాక్టు ఇచ్చారు. దాన్ని రద్దు చేసి మళ్లీ ఆ వ్యవస్థను పునరుద్ధరిస్తాను.



? తల్లికి వందనం, ఫీజు రీయింబర్స్‌మెంట్ ఎప్పుడు ప్రారంభిస్తారు
- గాయత్రి, విజ్ఞాన్ జూనియర్ కాలేజీ

లోకేశ్: ఓ పద్ధతి ప్రకారం హామీలన్నీ అమలు చేస్తున్నాం. దీపావళికి ఉచిత సిలిండర్ పథకాన్ని ప్రారంభిస్తున్నాం. అలాగే తల్లికి వందనం, ఫీజు రీయింబర్స్‌మెంట్ కూడా ప్రారంభిస్తాం. ఫీజును మళ్లీ పాత విధానంలోనే చెల్లించేలా ఆలోచిస్తున్నాం.



? మా పాపకు ఆరోగ్యం సరిగా లేదు. బీపీ తక్కువ అయిపోతోంది. ఆదుకోండి
- బిడ్డ హర్షిణిని చూపుతూ కన్నీరు పెట్టుకున్న తల్లి ప్రియాంక, కేజీ సత్రం

లోకేశ్: పాప ఆరోగ్యం బాధ్యత నేను తీసుకుంటాను. ఎమ్మెల్యే మురళి.. మీ వివరాలు సేకరించి ఫాలోఅప్ చేస్తారు. మీరు ఏడవద్దు. ధైర్యంగా ఉండండి.



? మీ పాదయాత్రలో.. పుంగనూరు, అంగళ్లు చంద్రబాబు పర్యటనల్లో అడ్డంకులు సృష్టించి, అక్రమ కేసులు పెట్టారు. వారి మీద ఎప్పుడు చర్యలు తీసుకుంటారు
- దొరబాబు, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్, బంగారుపాళ్యం

లోకేశ్: నా చర్యలు కనిపించడం లేదా? గత ప్రభుత్వంలో చట్టాన్ని అతిక్రమించిన అధికారులు ఇప్పటికే సస్పెన్షన్, విచారణలు ఎదుర్కొంటున్నారు. మరో ఆరు నెలల్లో ఇలాంటి చర్యలన్నింటినీ పూర్తి చేస్తాను.

గంటా మోహన్‌కు లోకేశ్ అభినందన



బంగారుపాళ్యం, సెప్టెంబరు 20: 'శభాష్ గంటా.. నేను 8సార్లే రక్తదానం చేశాను. మీరు వందోసారి చేస్తున్నారంటే గ్రేట్, కంగ్రాట్స్' అని బంగారుపాళ్యం ప్రభుత్వాస్పత్రిలో వందోసారి రక్తదానం చేస్తున్న ఉపాధ్యాయ సంఘ నేత గంటా మోహన్‌ను మంత్రి నారా లోకేశ్ అభినందించారు. ఈ సందర్భంగా ఎక్కడ పనిచేస్తున్నారని మంత్రి అడగ్గా.. అక్కడి అధికారి ఒకరు, గంటా మోహన్ ఉపాధ్యాయ సంఘ రాష్ట్ర నేత అని చెప్పారు. దీంతో ఆయన నవ్వుతూ.. విద్యాశాఖలో అంతా గందరగోళంగా ఉందని, అన్నీ సర్దుతామని అన్నారు. లోకేశ్ వెంట వచ్చిన కలెక్టర్ సుమిత్‌కుమార్ కూడా గంటాను ప్రత్యేకంగా అభినందించారు.

జ్వరంతో చిన్నారి మృతి



షబా పర్వీన్ (ఫైల్‌ఫొటో)

సదుం, సెప్టెంబరు 20: జ్వరం బారిన పడి ఓ చిన్నారి మృతి చెందిన ఘటన శుక్రవారం సదుంలో జరిగింది. సదుం గ్రామం జాండ్రపేట నివాసి షెహన్‌షా కుమార్తె షబా పర్వీన్(04) సుమారు ఐదు రోజులుగా జ్వరంతో అస్వస్థతకు గురైంది. ఆ చిన్నారిని పీలేరులోని ఓ ప్రైవేటు చిన్నపిల్లల ఆసుపత్రిలో వైద్యం అందించినట్లు తండ్రి షెహన్‌షా తెలిపారు. ఈ క్రమంలో గురువారం రాత్రి కడుపు నొప్పి అంటూ ఏడుస్తున్న చిన్నారిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ వైద్యుల సలహా మేరకు పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి 108 వాహనంలో తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ ఆసుపత్రిలోనే చిన్నారి మృతి చెందినట్లు తండ్రి తెలిపాడు. షబా పర్వీన్ మృతితో ఆ వీధిలో విషాదం నెలకొంది. కాగా సదుం ప్రభుత్వ వైద్యశాలలో పనిచేస్తున్న చిన్నపిల్లల వైద్య నిపుణులు డా.శ్రీధర్ గత ఏడాది జూన్‌లో బదిలీ అయ్యారు. అప్పటి నుంచి చిన్నపిల్లల వైద్యుడి పోస్టు ఖాళీగానే ఉంది. దీంతో చిన్నపిల్లల వైద్యం కోసం మండల ప్రజలు ఎక్కువ మంది పీలేరులోని ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. ఖాళీ పోస్టు భర్తీ కోసం డీసీహెచ్ఎస్ కార్యాలయ దృష్టికి తీసుకెళ్లినట్లు ఆసుపత్రి వైద్యాధికారిణి పుష్పకుమారి తెలిపారు.

ప్రేమ పెళ్లికి పెద్దలు అంగీకరించలేదని...

రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య



అశోక్(ఫైల్‌ఫొటో)

గుడుపల్లె, సెప్టెంబరు 20: ప్రేమపెళ్లికి పెద్దలు అంగీకరించకపోవడంతో రైలు కింద పడి ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన గుడుపల్లె మండలంలో చోటుచేసుకొంది. స్థానికులు, రైల్వే పోలీసుల కథనం మేరకు...యామిగానిపల్లె గ్రామానికి చెందిన మునిరత్నం కుమారుడు అశోక్(24) కుప్పంలో ఒకరి దగ్గర పనిచేస్తున్నాడు. ఇతడు కుప్పంలో ఓ యువతిని ప్రేమించాడు. అశోక్ ఈ విషయాన్ని తన కుటుంబ సభ్యులకు తెలియజేశాడు. వీరిద్దరి కులాలు వేర్వేరు కావడంతో అశోక్ కుటుంబ సభ్యులు వీరి పెళ్లికి అడ్డు చెప్పారు. కొన్ని నెలలుగా అశోక్ పెళ్లి విషయమై ఇంట్లో గొడవలు చోటుచేసుకొనేవి. గురువారం రాత్రి అశోక్ ఆ యువతితోనే పెళ్లి జరిపించాలని కుటుంబ సభ్యులను కోరగా వారు కుదరదన్నారు. పెళ్లి జరిపించకపోతే తాను ఆత్మహత్య చేసుకొంటానని కుటుంబ సభ్యులకు చెప్పి ఇంటి నుంచి ద్విచక్రవాహనం తీసుకొని బయలుదేరాడు. కుప్పం రైల్వేస్టేషన్ దగ్గర తన ద్విచక్రవాహనాన్ని ఉంచి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు అశోక్ కోసం గాలించగా కుప్పం రైల్వేస్టేషన్‌కు కొంతదూరంలో రైలు పట్టాలపై ఆత్మహత్య చేసుకుని ఉండటాన్ని గమనించారు. దీంతో వారు రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహానికి కుప్పం ప్రభుత్వ ఆసుపత్రిలో శుక్రవారం పోస్టుమార్టు నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

విమాన వాహనంపై గణనాథుడి విహారం



విమానంలో ఊరేగుతున్న సిద్ధి, బుద్ధి సమేత వరసిద్ధుడు

ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 20: కాణిపాకంలో నిర్వహిస్తున్న ప్రత్యేక ఉత్సవాలలో శుక్రవారం వరసిద్ధుడు విమాన వాహనంపై విహరించారు.ఉభయదారులైన ఐరాలకు చెందిన దివంగత రామకృష్ణపిళ్లై కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఉదయం స్వామివారికి అభిషేకం నిర్వహించారు. రాత్రి ఉభయదారులు వరస తీసుకురావడంతో అలంకార మండపంలో స్వామి ఉత్సవ విగ్రహాలకు ఘనంగా పూజలు నిర్వహించి.. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం సిద్ధి, బుద్ధి సమేత వరసిద్ధి వినాయకస్వామి ఉత్సవ విగ్రహాలను విమాన వాహనం (సప్పరం)పై ఉంచి కాణిపాక పురవీధుల్లో వైభవంగా ఊరేగించారు. ఈవో గురుప్రసాద్, ఏఈవోలు విద్యాసాగర్‌రెడ్డి, ఎస్వీ కృష్ణారెడ్డి, ఆలయ సూపరింటెండెంట్లు కోదండపాణి, వాసు, ఇన్‌స్పెక్టర్లు విఘ్నేష్, రవి, ఉభయదారులు పాల్గొన్నారు.

పుష్పపల్లకి సేవకు భారీ ఏర్పాట్లు

కాణిపాకంలో శనివారం స్వామికి పుష్పపల్లకి సేవ నిర్వహించనున్నారు.ఉభయదారులు భారీ ఏర్పాట్లను చేస్తున్నారు. ప్రధాన ఆలయాన్ని వివిధ రకాల పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. స్వామి దర్శనార్థం ప్రత్యేక క్యూలైన్లను ఇంజనీరింగ్ శాఖ అధికారులు ఏర్పాటు చేశారు. లడ్డు, ప్రసాదాల కొనుగోలుకు ప్రత్యేక కౌంటర్లు పెడుతున్నారు.



పుష్పపల్లకి ఏర్పాట్లలో ఉభయదారులు

మమ.. అనిపించారు!



- జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశానికి గైర్హాజరైన పలువురు అధికారులు, జడ్పీటీసీలు
- కోరం లేకుండానే రెండు సమావేశాల నిర్వహణ

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 20: జిల్లా పరిషత్ స్టాండింగ్ కమిటీ సమావేశం శుక్రవారం తూతూ మంత్రంగా నిర్వహించారు. 1 నుంచి 7 సమావేశాలను ఒక్కే దగ్గర నిర్వహించారు. ఇందులో రెండు సమావేశాలను కోరం లేకుండానే ముగించారని విమర్శలు వస్తున్నాయి. రెండు గంటల్లోనే సమావేశాలన్నిటినీ ముగించారు. వివిధ శాఖలకు సంబంధించిన జిల్లా స్థాయి అధికారులు ఒకరు ఇద్దరు మాత్రమే హాజరయ్యారు. జడ్పీటీసీ సభ్యులు కూడా కొందరే వచ్చారు. జడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులు, కొందరు సభ్యులు కొన్ని సమస్యలను ప్రస్తావించారు. ప్రధానంగా.. చిత్తూరులో అమూల్ డెయిరీ ప్రారంభమైనా పాల సేకరణ ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. వ్యవసాయ విద్యుత్ సర్వీసులు మంజూరులో జాప్యాన్ని నివారించాలని కోరారు. వి.కోట ప్రభుత్వ ఆస్పత్రిలో రాత్రైతే వైద్యులు ఉండడం లేదని చర్యలు తీసుకోవాలన్నారు. జడ్పీ సీఈవో గ్లోరియా, జడ్పీ వైస్‌ఛైర్మన్లు ధనంజయరెడ్డి, రమ్య తదితరులు పాల్గొన్నారు.

మంత్రి లోకేశ్ పర్యటనే కారణమా?

బంగారుపాళ్యంలో మంత్రి లోకేశ్ పర్యటన కారణంగా జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశానికి దాదాపుగా జిల్లా స్థాయి అధికారులు హాజరు కాలేనట్టుగా తెలుస్తోంది. ఇక ఎమ్మెల్యేలు కూడా మంత్రి కార్యక్రమంలో ఉండడంతో సమావేశానికి హాజరుకాలేకపోయారు. జడ్పీటీసీలైతే స్టాండింగ్ కమిటీనే కదా అని లైట్‌గా తీసుకున్నారు. మొత్తానికి సమావేశాన్ని మమ అనిపించారు.

భూమాయగాడు

నకిలీ పత్రాలతో రిజిస్ట్రేషన్

తహసీల్దార్ ఫిర్యాదుతో వెదురుకుప్పంలో కేసు నమోదు


ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
గ్రామ-వార్డు సచివాలయ శాఖ

నకిలీ పత్రం ఇదే

వెదురుకుప్పం, సెప్టెంబరు 20: భూమి మీద కన్నుపడింది. ఆ భూమిని తన సొంతం చేసుకోవాలనుకున్నాడు. అంతే నకిలీ పత్రాలను సృష్టించి ఏకంగా రిజిస్ట్రేషన్ కూడా చేయించుకున్నాడు. ఈ ఘనుడిపై వెదురుకుప్పం తహసీల్దార్ రమేష్ ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ విషయాన్ని ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య శుక్రవారం ధ్రువీకరించారు. వివరాలిలా ఉన్నాయి. వెదురుకుప్పం మండలం జక్కిదొన రెవెన్యూ లెక్కదాఖలా సర్వే నెంబరు 513/16లో 0.66 సెంట్ల భూమికి ఇదే మండలంలోని గంటావారిపల్లెకు చెందిన వెంకటరెడ్డి కుమారుడు ఎస్.పుల్లారెడ్డి (వైసీపీ సానుభూతిపరుడు) నకిలీ పత్రాలు సృష్టించి రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఈ భూమి సొంతదారైన గంటావారిపల్లెకు చెందిన ఎస్.నీలమ్మ తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేయడంతో విషయం బయట బడింది. ఆరా తీస్తే.. నకిలీ రికార్డులు సృష్టించి పాకాల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ కానిచ్చినట్లు తెలిసింది. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సమర్పించిన సర్వే నెంబరు 513/16 అడంగల్.. ప్రస్తుతం వెబ్లాండ్ రికార్డుల ప్రకారం పరిశీలించగా.. అందులో కానీ, పూర్వపు రికార్డులో కూడా చూపించలేదని, నకిలీ పత్రం తయారు చేశారని, దీనిపై గంటావారిపల్లెకు చెందిన వెంకటరెడ్డి కుమారుడైన పుల్లారెడ్డిపై చీటింగ్, ఫోర్జరీ కేసు నమోదు చేసి, కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఈనెల 17వ తేదీన తహసీల్దార్ ఫిర్యాదు చేశారు. దాంతో పుల్లారెడ్డిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఎవరీ పుల్లారెడ్డి?

నకిలీ పత్రాలు ఎలా సృష్టించాడు. దీనివెనుక పాత్ర, సూత్రధారులు ఎవరనే విషయమై వెదురుకుప్పం మండలంలో చర్చ జరుగుతోంది. నకిలీ, ఫోర్జరీ సంతకాలతో రిజిస్ట్రేషన్‌కు సహకరించిన రిజిస్ట్రార్ కార్యాలయం ఉద్యోగులు ఎవరన్న విషయంపైనా చర్చ నడుస్తోంది. కూటమి ప్రభుత్వం చొరవ చూపి నకిలీ పత్రాల తయారీదారుల గుట్టు రట్టు చేయాలని బాధితులు విజ్ఞప్తి చేశారు.

న్యాయం చేయాలి



మా భూమికి నకిలీ పత్రాలను తయారు చేసిన పుల్లారెడ్డిపై కఠిన చర్యలు తీసుకోవాలి. అతడికి సహకరించిన వారిపైనా చర్యలు తీసుకోవాలి. మాకు న్యాయం చేయకుంటే ప్రాణత్యాగానికైనా సిద్ధం.
- నీలమ్మ, బాధితురాలు, గంటావారిపల్లె

ప్రశాంతంగా వార్డు కార్యదర్శుల బదిలీల ప్రక్రియ

చిత్తూరు, సెప్టెంబరు 20: ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని నగర, పురపాలక సంఘాల పరిధిలోని వార్డు కార్యదర్శుల బదిలీల ప్రక్రియ చిత్తూరులో శుక్రవారం జరిగింది.వివిధ కేటగిరీల్లో బదిలీల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న ఉద్యోగులు కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. కేటగిరీల వారీగా అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన చేపట్టారు.వార్డు అడ్మిన్ కార్యదర్శులు 18మంది, ప్రణాళిక కార్యదర్శులు 18మంది, అమినిటీ కార్యదర్శులు 15మంది, వార్డు శానిటేషన్ కార్యదర్శులు 16మంది, ఎడ్యుకేషన్ డేటా కార్యదర్శులు 17మంది, వార్డు వెల్ఫేర్ కార్యదర్శులు 30మంది హాజరయ్యారు. సహాయ కమిషనర్ ప్రసాద్, పలమనేరు, పుత్తూరు, పుంగనూరు, నగరి కమిషనర్లు, మేనేజరు వర్మ, ఏసీపీ రామకృష్ణుడు, ఇంజనీరింగ్‌శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఇంటింటికీ 'ఇది మంచి ప్రభుత్వం' స్టిక్కర్ల పంపిణీ



చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 20: కూటమి ప్రభుత్వం వంద రోజుల పాలనపై 'ఇది మంచి ప్రభుత్వం' పేరుతో ఇంటింటికీ స్టిక్కర్లను, కరపత్రాలను పంపిణీ చేయనున్నారు. ఇందుకోసం జిల్లా కేంద్రానికి 6.02 లక్షల స్టిక్కర్లు, 6.08 లక్షల కరపత్రాలు చేరగా వాటిని 31 మండలాలకు జిల్లా యంత్రాంగం తరలించింది. కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తయిన సందర్భంగా గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది శనివారం నుంచి తమ పరిధిలోని ఇంటింటినీ సందర్శించి వీటిని అందజేస్తారు. ఈనెల 26వ తేదీవరకు జరిగే ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిల ఆధ్వర్యంలో రోజుకో గ్రామంలో ప్రజా వేదిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. శుక్రవారం బంగారుపాళ్యంలో మంత్రి నారా లోకేశ్.. ప్రజావేదిక కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు.

కొడుకు వద్దకు చేరిన తండ్రి రామయ్య

నిమ్మనపల్లి, సెప్టెంబరు 20: నిమ్మనపల్లె చేరిన రామయ్య శుక్రవారం అతని కొడుకు వెంకటేష్ వద్దకు చేరుకున్నాడు. దీంతో అతని అనాథ కథ సుఖాంత మైంది. ఈ విషయమై శుక్రవారం ఓ తండ్రికి అందరూ ఉన్నా అనాథగా నిమ్మనపల్లి చేరడంతో 'తను తప్పిపో యాడా..వదిలేశారా..'వార్తను 'ఆంధ్రజ్యోతి' పత్రికలో శుక్ర వారం ప్రచురితమైంది. దీంతో చిన్న కుమారుడు వెంకటేష్ 'ఆంధ్రజ్యోతి' పత్రికలో వచ్చి కథనాన్ని చూసి తన తండ్రి రామయ్య ఉన్న వెంకోజిగారిపల్లికు చేరుకొని జరిగిన విషయాలను వివరించారు. వాస్తవానికి తమది అనం తపురం జిల్లా నల్లమాడ మండలం చెంద్రాయునిపల్లి గ్రామమని కొన్నేళ్ల క్రితం వెంగం వారిపల్లి పంచాయతి పిల్లగోవులపల్లిలో తాను వివాహం చేసు కొన్నానని తమ అత్తమామా ఇద్దరూ లేక పోవడంలో ఇక్లటం వచ్చినట్లు తెలిపాడు. తన తండ్రి రామయ్య తన అన్నల వద్ద ఉండే వాడని ఏడాది క్రితం తన వద్దకు వచ్చి నట్లు తెలిపాడు. అప్పటి నుంచి ఇంటి వద్దనే ఉంటున్నాడని వా రం రోజుల క్రితం కనిపించకుండా వెళ్లాడని తెపారు. అప్పటి నుంచి తన తండ్రి రామయ్య కోసం వెదకుతున్నట్లు తెలిపాడు. అనంతరం నడవ లేని తన తండ్రి రామయ్యరు ఆటోలో పిల్లగోవు లపల్లి తీసుకెళ్లాడు.

మత్తులో యువకుల వీరంగం

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 20: మండలంలోని ఈశ్వరమ్మ కాలనీలో ఇద్దరు యువకులు గంజాయి మత్తులో ఆటో డ్రైవర్‌పై దాడి చేసి గాయపరచడమే కాకుండా ఆటో అద్దాలను ధ్వంసం చేశారు. పోలీసుల వివరాల మేరకు శుక్రవారం మధ్యాహ్నం దేవ ళం వీధికి చెందిన హర్షద్ (25), సలీంలు ఈశ్వరమ్మ కాలనీకి చెందిన గురునాథ్ ఆటోలో వచ్చి ఈశ్వరమ్మ కాలనీలో దిగ్గారు. ఆటో డ్రైవర్ బాడుగ అడగడంతో మమ్మల్నే బాడుగ అడు గుతావా అంటూ గంజాయి మత్తులో ఉన్న యువకులు ఆటో డ్రైవర్‌పై దాడిచేసి ఆటో అద్దాలను ధ్వంసం చేశారు. అక్కడే ఉన్న కాలనీ వాసులు గమనించి మత్తులో ఉన్న ఇద్దరికి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. తాలుకా సీఐ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

నిందితులను అరెస్టు చేయవద్దు

- పోలీసులకు హైకోర్టు ఆదేశాలు

బి.కొత్తకోట, సెప్టెంబరు 20: బి.కొత్తకోట పట్టణంలో ఈనెల 13న వినాయక నిమజ్జనం సందర్భంగా కేసు నమోదైన నిందితులను అరెస్టు చేయవద్దంటూ హైకోర్టు పోలీసులకు ఆదేశాలు జారీ చేసింది. ఈనెల13న వినాయక నిమజ్జనం సందర్భంగా జగన్ పాటలు వేసి, కవ్వింపు చర్యలకు పాల్పడ్డారంటూ పట్టణంలోని పోకనాటివీధికి చెందిన లోకేష్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, కళ్యాణ్‌కుమార్ రెడ్డి, మోహన్‌రెడ్డి తదితరులు 9మంది తోపాటు, ఇతరులు 50మందిపై బి.కొత్తకోట పోలీసులు కేసు నమోదు చేసిన విష యం తెలిసిందే. అప్పటి నుంచి నిందితుల అరెస్టు కోసం పోలీ సులు గాలిస్తున్నారు. కాగా ఈ కేసులో నిందితులను రెండు వారాల పాటు ఎటువంటి చర్యలు తీసుకోరాదని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీవీయల్‌యన్ చక్రవర్తి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

దళితులపై కేసులు నమోదు చేయడం తగదు

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 20: దళితులపై కేసులు నమోదు చేయడం తగదని బీఎస్పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బందెల గౌతమ్‌కు మార్ పేర్కొన్నారు. శుక్రవారం బీఎస్పీ కార్యాలయంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ పెరియార్ జయంతి సందర్భంగా బీఎస్పీ చేపట్టిన ర్యాలీలో పాల్గొన్న దళితులపై కేసు నమోదు చేయడం దారుణమన్నారు. ప్రభుత్వం ఇలాంటి చర్య లు చేపట్టడం తగదన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు పాల్గొన్నారు.

భూ సమస్యలను పరిష్కరించండి

●తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతుల ధర్నా



ధర్నా చేస్తున్న రైతు సంఘం నాయకులు

ములకలచెరువు, సెప్టెంబరు 20: మండలంలో నెలకొన్న భూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్ర వారం రైతు సంఘం నాయకులు స్థానిక తహసీల్దార్ కార్యా లయం ఎదుట ధర్నా నిర్వహించారు. రీసర్వే జరిగిన గ్రామాల్లో వన్ బీ రాక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అర్హులం దరికి ఇంటి పట్టాలు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ ప్రదీప్‌కుమార్‌కు వినతిపత్రాన్ని అందజే శారు. కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షుడు చిన్నవెంకటరమ ణనాయుడు, మండల అధ్యక్షుడు అనిల్‌కుమార్, ఉపాధ్యక్షుడు నారాయణ, సహాయ కార్యదర్శి రోహిత్‌కుమార్, నాయకులు నాగ రాజు, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

నేడు పీలేరులో ప్రజావేదిక

పీలేరు, సెప్టెంబరు 20: కూటమి ప్రభుత్వం 100 రోజుల్లో సాధిం చిన ప్రగతిని వివరించేందుకు శనివారం పీలేరులో ప్రజావేదిక కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు పీలేరు ఎంపీడీవో ఉపేందర్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక పంచాయతీ కార్యా లయంలో ఉదయం 9.30 గంటలకు జరిగే ప్రజావేదిక కార్యక్ర మంలో ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొంటారని ఆయన వివరించారు.

లడ్డూ కల్తీ వెనకున్న వారిని శిక్షించాలి


మదనపల్లెలో వేంకటేశ్వరస్వామి చిత్రపటానికి పసుపునీళ్లతో అభిషేకం చేస్తున్న టీడీపీ నాయకులు

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 20: తిరుమల శ్రీవారి లడ్డూలో నెయ్యి కల్తీకి కారణమైన వారిని వెంటనే అరెస్టు చేయాలని తెలుగు యువత నియో జకవర్గ అధ్యక్షుడు నాదెళ్ల అరుణ్‌తేజ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ 50 ఏళ్లుగా టీటీడీకి కేఎంఎఫ్‌కు చెందిన నందిని నెయ్యి సరఫరా చేస్తుంటే జగన్ ప్రభుత్వం వచ్చాక తమిళనాడు కాంట్రాక్టర్‌కు నెయ్యి సరఫరా కాంట్రాక్టు ఇచ్చారన్నారు. ఆ కాంట్రాక్టర్ నెయ్యిలో జంతువుల కొవ్వును కల్తీ చేసి సరఫరా చేశాడన్నారు. జగన్ తీరు పరిశీలిస్తే తిరుమల లడ్డూను అపవిత్రం చేసేందుకే నెయ్యి సరఫరా కాంట్రాక్టు మార్చారని ఆరోపించారు.

భక్తుల మనోభావాలను దెబ్బతీసిన వారిని కఠినంగా శిక్షించాలి

తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి భక్తుల మనోభవాలను దెబ్బతీసే విధంగా చర్యలు చేపట్టిన దుష్టులను కఠినంగా శిక్షించాలని టీడీపీ యువ నాయ కుడు కంచెర్ల చింటూ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక చిత్తూరు బస్టాండు సర్కిల్ వద్ద చింటూ ఆధ్వర్యంలో వేంకటేశ్వరస్వామి పటానికి పసుపునీళ్లతో అభిషేకం చేసి, నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ తిరుమల లడ్డూ తయారీలో ఉపయోగించే నెయ్యిలో జంతు, పంది కొవ్వు ను కలపడం దారుణమన్నారు. టీడీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రాట కొండ మధుబాబు మాట్లాడుతూ ప్రజల మనోభావాలను కించపరచిన వారిని ప్రజాకోర్టులో నిలబెట్టి శిక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిప ల్ మాజీ కౌన్సిలర్ సహజీవన్‌బాబు, మాజీ సైనిక సంఘం ప్రధాన కార్యదర్శి వెంకటస్వామి, సి. గంగాధరం, రెడ్డిసుబ్రమణ్యం, రెడ్డెప్పరావు, గగన్, హరి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

తిరుమల లడ్డూలో కొవ్వు పదార్థాలు కలపడం దుర్మార్గం

కలికిరి, సెప్టెంబర్టు 20: కోట్లాది మంది భక్తులు అత్యంత ప్రీతిపాత్రంగా, భక్తి భావంతో స్వీకరించే తిరుమల వేంకటేశ్వర స్వామివారి లడ్డూలో జంతువుల కొవ్వును కలపడం అత్యంత దుర్మార్గమైన చర్య అని విశ్వ హిందూ పరిషత్తు దక్షిణాంధ్ర రాష్ట్ర సామాజిక సమరసత ప్రముఖ్, కలికిరికి చెందిన చింతపర్తి మహేష్ ధ్వజమెత్తారు. పవిత్రమైన లడ్డూలో నాలు గేళ్లుగా జంతువుల కొవ్వును కలుపుతున్నారనే విషయం నిర్ధారణ కావడం భక్తులను తీవ్రంగా కలిచివేస్తోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిణామాలు కేవలం ఒక్క తిరుమల లడ్డూ ప్రసాదంలో మాత్ర మే జరిగిందా లేక రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అనేక ప్రసిద్ధ ఆలయాల్లో అమలు చేసేందుకు కూడా వైసీపీ ప్రభు త్వం తెగించిందా అనే కోణంలో విచారణ జరిపించాలని మహేష్ డిమాం డ్ చేశారు. సుప్రీంకోర్టు రిటైర్డు జడ్జి చేత విచారణ చేయించి నిర్ధారిం చాల్సిందిగా ఆయన శుక్రవారం ఓ పత్రికా ప్రకటనలో డిమాండ్ చేశారు.

ఝరికోన కార్మికుల జీతాలు చెల్లించాలి



ఆందోళన తెలియజేస్తున్న ఝరికోన కార్మికులు

పీలేరు, సెప్టెంబరు 20: గత 11 నెలలుగా పెండింగ్‌లో ఉ న్న ఝరికోన ప్రాజెక్టు కార్మికు ల జీతాలు తక్షణమే చెల్లిం చాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న జీతాల కో సం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కార్మికులు శుక్రవారం పీలేరులోని ఆర్ డబ్ల్యూఎస్ డీఈ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సంద ర్భంగా సాంబశివ మాట్లాడుతూ గతేడాది నవంబరు నుంచి కార్మికులకు జీతాలు చెల్లించలేదని, నెలకు కేవలం రూ.5 వేల జీతాన్ని కూడా సక్ర మంగా ఇవ్వని కాంట్రాక్టరుపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్మికులను కాంట్రాక్టు పద్ధతిలో కాకుండా ఆప్కాస్‌లో నమోదు చేసి వారి జీతాలను వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసేటట్లు చర్యలు తీసుకుని వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ పీలేరు నియోజకవర్గ కార్యదర్శి టీఎల్ వెంకటేశ్, నాయకులు నరసింహులు, కార్మికులు గుర్రప్ప, ఆనంద కుమార్, రామాంజులు, రవి, నాగరాజు, మురళీ, శివ, భరత్ రెడ్డి, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక కష్టాలు తీర్చాలంటూ ధర్నా

బి.కొత్తకోట, సెప్టెంబరు 20: బి.కొత్తకోట మండలంలో ఇసుక కష్టాలను తీర్చి భవననిర్మాణ కార్మికులను ఆదుకోవాలని భవననిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి సలీంబాషా డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జ్యోతిచౌక్‌లో రోడ్డుపై బైఠాయించి ధర్నా చేశారు. ఈ సంద ర్భంగా ఏఐటీయూసీ నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉచి తంగా ఇసుక ఇస్తామని చెబుతున్నా, బి.కొత్తకోటలో అమలు కావడం లేదని, చాటుగా తరలించే ఇసుక రూ.5000 పెట్టి కొనాల్సి వస్తోం దన్నారు. అనంతరం ర్యాలీగా వెళ్లి తహశీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు వేణుగో పాల్‌రెడ్డి, రఘునాథ్, ఆదినారాయణ, రామాంజినేయులు, పీటీయం పాపన్న, రఫీ, షఫీ, బషీర్, సమీవుల్లా తదితరులు పాల్గొన్నారు.

వరుణదేవుడు కరుణించాలని చండీ యాగం


చండియాగంలో పాల్గొన్న దత్త విజయానందస్వామి

మదనపల్లె అర్బన్, సెప్టెంబ రు20: వరుణదేవుడు కరుణిం చి, వర్షాలు కురిపించాలని చండీ యాగం నిర్వహిస్తున్నట్లు దత్త విజయానంద స్వామీజీ పేర్కొన్నారు. శుక్ర వారం మదనపల్లె మండలం, పెంచుపాడు రోడ్డులోని దత్త ఆశ్రమంలో నిర్వహిం చిన దత్తపూజ, చండీయాగంలో దత్త విజయానంద స్వామి పాల్గొన్నారు. అంతకముందే 101 కలశాలతో ఆశ్రమ నిర్వాహకుడు వెంకటేశ్వర్లు విద్యార్థులతో కలిసి కోలాట భజనతో ఘన స్వాగతం పలికారు. మదన పల్లె చుట్టుపక్కల ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నా రు. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. రెండు వేలమందికి విద్యా ర్థులకు భగవద్గీత గ్రంథాన్ని, పెన్నులను పంపిణీ చేశారు. ఈ సంద ర్భంగా దత్త విజయానంద స్వామి మాట్లాడు తూ. వరుణదేవుడు కరు ణించాలనే చండీ యాగంతో రైతులు పంటలతో సుభిక్షంగా ఉండాలని ఆకాక్షించారు. కార్యక్రమంలో కనకదాస్ ట్రస్టు నిర్వాహకులు పరంధామ య్య గౌడ్, టీడీపీ నాయకులు నంద, బీజేపీ నాయకులు బండి ఆనంద్, మదనపల్లె రూరల్ అధ్యక్షుడు పచ్చిపాల వసంతకుమార్, జయలక్ష్మీ మహిళా మండలి సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

పీలేరు, సెప్టెంబరు 20: రాష్ట్రంలోని ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని నోబుల్ టీచర్స్ అసోసి యేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు రెడ్డి రమేశ్, రాష్ట్ర విద్యాశాఖా మంత్రి నారా లోకేశ్‌కు విజ్ఞప్తి చేశారు. చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం పర్యట నకు విచ్చేసి మంత్రికి ఆయన గురువారంఈ మేరకు వినతి పత్రం అందజేశారు. జీవో నెం.117ను రద్దు చేయాలని, తెలుగు మీడియంను పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. ప్రాథమిక పాఠశాలలను బలోపేతం చేయాలని, అందులో భాగంగా మోడల్ స్కూల్ కాంప్లెక్స్ ఏర్పాటు చేసి విద్యార్థులకు రవాణా సౌకర్యం కల్పించాలన్నారు. తమ సమస్యలపై మంత్రి సానుకూలంగా స్పందించారని, వీలైనంత త్వరగా వాటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని రెడ్డి రమేశ్ తెలిపారు.

దోబీఘాటులో అవినీతి మకిలీ!


పీలేరులోని దోబీఘాటు అందులోని బోరు, మోటారు

పీలేరు, సెప్టెంబరు 20: గత ప్రభుత్వ హయాంలో దోబీ ఘాటులో అవినీతి జరిగినట్లు ఆలస్యంగా వెలుగుచూసింది. పీలేరు-తిరుపతి మార్గంలో ఉన్న దోబీఘాటుకు రజక సంఘ నాయకులు, సభ్యులు, దాతలు వేసిన బోరు, పైపు లైను, అందజేసిన మోటారుకు పంచాయతీలో పనిచేసే ఓ సాధారణ వాటర్ మెన్ బిల్లు చేసుకునేం దుకు ప్రయత్నించిన సంఘటనను రజక సంఘ నాయకులు కనుగొ న్నారు. తాము కష్టపడి చందాలు వేసుకుని వేసుకున్న బోరు ప్రభుత్వం వేసినట్లు రికార్డులు సృష్టించినట్లు తెలియడంతో వారు భగ్గుమన్నారు. విషయాన్ని పంచాయతీ ఈవో దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన విచార ణకు ఆదేశించారు. పీలేరు పట్టణ ప్రజల అవసరాల కోసం 1990 ప్రాం తంలో పీలేరు-తిరుపతి మార్గంలో అప్పటి అధికారులు, ప్రజాప్రతి నిధులు దోబీఘాటును ఏర్పాటు చేశారు. దోబీఘాటు అవసరాలు పెరగ డంతో దానికి బోరు, మోటారు, పైపులైను అవసరం ఏర్పడి రజక సం ఘ నాయకులు తలో చేయి వేసుకుని, కొంత మంది దాతలను సంప్ర దించి బోరు, మోటారు, పైపులైను వేసుకున్నారు. అయితే ఆ బోరు ప్రభుత్వం వేసినట్లు గల నెల 23వ తేదీన పీలేరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో జరిగిన గ్రామసభలో వెల్లడి కావడంతో గ్రామసభకు హాజరైన రజక సంఘ నేతలు ఖంగుతిన్నారు. బోరు, మోటారు, పైపు లైను కోసం రూ.5 లక్షల దాకా వెచ్చించినట్లు అటు పంచాయతీ, ఇటు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల ద్వారా ఆ మొత్తం కోసం ఎంబుక్కు రికార్డు చేయించి బిల్లుల కోసం పంచాయతీ కార్యాలయంలో అందజేసినట్లు సమాచారం. అయితే బిల్లుల చెల్లింపులో ఆలస్యం జరగడంతో ఆ వ్యవ హారం సాకారం కాలేదు. గతంలో పీలేరు పంచాయతీలో పలు పనులు చేసిన మదనపల్లెకు చెందిన ఓ సంస్థ తనకు రావాల్సిన బిల్లు ల కోసం పంచాయతీకి చెందిన పలు ఎంబుక్కులను తన వద్ద అట్టిపె ట్టుకుం దని దీంతో చెల్లింపులు జరగనట్లు తెలిసింది. ఈ విషయమై పీలేరు పంచాయతీ ఈవో గురుమోహన మాట్లాడుతూ దోబీఘాటు బిల్లుల ప్రయత్నం ఏడాదిన్నర క్రితం జరిగిందన్నారు. స్థానిక రజక సంఘం నేతలు ఆ విషయాన్ని తన దృష్టికి తేవడంతో తాను విచారణ కు ఆదే శించానని, అందులో భాగంగా ఎంబుక్కు మదనపల్లెకు చెందిన ప్రైవే టు సంస్థ వద్ద ఉన్నట్లు తేలిందన్నారు. అయితే వాటన్నింటిపై తాను జిల్లా పంచాయతీ అధికారికి నివేదిక అందజేశానని, వారి ఆదేశా ల మేరకు చర్యలు తీసుకుంటానన్నారు.

పీటీఎంలో ముగిసిన క్రీడాపోటీలు

పెద్దతిప్పసముద్రం సెప్టెంబర్ 20 : మండల కేంద్రమైన పీటీఎంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల(తెలుగు)లో రెండురోజులుగా జరుగు తున్న మండల స్థాయి క్రీడా పోటీలు శుక్రవారం ముగిశాయి. మండ లంలోని వివిధ పాఠశాలల నుంచి బాలబాలికలు పాల్గొని క్రీడా నైపు ణ్యం ప్రదర్శించి మండల స్థాయి జట్టుకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అపర్ణాదేవి, ఎంఈవోలు, నారాయణ, గౌస్‌పీర్, పీడి. ఎం. జవహర్, కార్తిక్, తదితరులు పాల్గొన్నారు.
గుర్రంకొండలో:క్రీడలతో మంచి ఆరోగ్యాన్ని సంపాదించుకోవచ్చని టీడీ పీ నాయకులు పేర్కొన్నారు. మండలంలోని తరిగొండలో యువ క్రీడా కారుల కోసం క్రికెట్ మ్యాచ్‌ను ఏర్పాటు చేశారు. ఈ క్రికెట్ పోటీల్లో సుమారు 10 జట్లు పాల్గొన్నాయి. ఈ క్రమంలో తరిగొండ క్రికెట్ జట్టు విజయం సాధించగా రూ.25 వేలు, రన్నర్ జట్టుకు రూ.15 వేలు అంద జేశారు. టీడీపీ నేతలు దేవకి, అల్తాఫ్, సద్దామ్, నిస్సార్ పాల్గొన్నారు.
ములకలచెరువులో: క్రీడలతోనే మానసిక ఉల్లాసం చేకూరుతుందని ఎంపీడీవో పోలప్ప, తహసీల్దార్ ప్రదీప్‌కుమార్, ఎంఈవో వెంకటరమణ పేర్కొన్నారు. స్థానిక జడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం మండల స్థాయి క్రీడా పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు తప్పనిసరిగా క్రీడలపై మక్కువ పెంచుకోవాలన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ప్రముఖులు దాసరిపల్లి నారాయణరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మంచి ఆహారంతోనే ఆరోగ్యం

కలికిరి, సెప్టెంబర్టు 20: మంచి ఆహారం తీసుకుంటే విద్యార్థులు ఆరో గ్యంగా ఉంటారని వాల్మీకిపురం ఐసీడీఎస్ సీడీపీవో భారతి పేర్కొ న్నారు. పోషణ మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక బీసీ బాలిక ల గురుకుల పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆమె బాల్య వివా హా లు, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. వైస్ ప్రిన్సిపాల్ స్వర్ణలత, భ్రమరాంబ, సూపర్‌వైజర్, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడుకుందాం

పెద్దతిప్పసముద్రం సెప్టెంబర్ 20 : స్వచ్ఛతాహే కార్యక్ర మాలను మండలంలోని అన్ని గ్రామాల్లో మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకుందామని ఎంపీడీవో కేఎస్‌బాలా జీ పేర్కొన్నారు. శుక్రవారం ఎంపీడీవో మాట్లాడుతూ ఆయా గ్రామాల్లో మురికినీటి కాలువలు శుభ్రం చేయడం, కాలు వల్లో బ్లీచింగ్ చల్లడం, జనావాసాల్లో ఏపుగా పెరిగిపోయిన ముళ్లపొదలను, చెత్తదిబ్బలను తొలగించడం జరిగిందన్నా రు. తహసీల్దార్ శ్రీరాములు నాయక్, ఈవోఆర్డీ యోగా నంద్, ఎంఈవో 2 గౌస్‌పీర్, ఉపాధిహామీ ఏపీవో తిరుపా లప్ప, మోడల్ స్కూల్ ప్రిన్స్‌పాల్ శివకుమారి,లతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.
కలకడలో:పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్క రూ మొక్కలు నాటి సంరక్షించాలని ఎంపీడీవో పరమే శ్వరరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని అన్ని పంచాయితీలో శుక్రవారం స్వచ్ఛతాహి సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా అందరి భాగస్వామ్యంతో ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, ఆసుపత్రి ఆవరణలో 540 మొక్కలు నాటించడం జరిగిందన్నారు.
వాల్మీకిపురంలో: పచ్చదనం పరిరక్షించుకోవడం ద్వారా పరిపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని వాల్మీకిపురం టీడీపీ మం డల అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో స్వచ్ఛ తాహి సేవా కార్యక్రమంలో భాగంగా వనమహోత్సవం చేపట్టి మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్ర మాలలో ప్రిన్సిపాల్ కల్పన, ఎంపీడీవో మనోహర్‌రాజు, మండల ఉపాధ్యక్షుడు రామకృష్ణ, నాయకులు రమణ, చంద్రమౌళి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థి అదృశ్యంపై కేసు నమోదు

మదనపల్లె అర్బన్, సెప్టెంబర్ 20: విద్యార్థి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసులు తెలిపారు. మదన పల్లె పట్టణం, విజయనగర్ కాలనీకి చెందిన విద్యార్థిని సమీపంలోని స్కూల్‌లో 10 వతరగతి చదువుతోంది. ఈ నెల 18న స్కూల్‌కు వెళ్లి తిరిగిరాలేదని కుటుంబసభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 20: అనారోగ్య కారణంతో యువకుడు గొంతుకోసుకున్న సంఘటన మదనపల్లెలో చోటుచేసుకుంది. మదనపల్లె పట్టణం దిగువకమ్మపల్లెకు చెందిన రెడ్డి(20).శుక్రవారం రాత్రి గొంతు కోసుకుని ఆత్మహత్య ప్రయత్నం చేశాడు. కాగా స్థానికులు చికిత్స కోసం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఆయనను తిరుపతికి రెఫర్ చేశారు.

మృతుడు చీకలబైలు వాసి

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 20: మదనపల్లె- కర్ణాటక సరిహద్దులోని రాయల్పాడు వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డుప్రమాదంలో మృతి చెందిన యువకుడు మదనపల్లె మండలం, చీలకబైలుకు చెందిన గుర్రప్ప కుమారుడు గుణశేఖర్ (27)గా గుర్తించినట్లు రాయల్పాడు ఎస్ఐ యోగేష్‌కుమార్ తెలిపారు. బైక్‌పై కర్ణాటక నుంచి మద్యం తరలిస్తూ మార్గమధ్యంలో రాయల్‌పాడు వద్ద ఓ ప్రైవేట్ బస్సు ఢీ కొట్టడంతో ప్రమాదంలో యువకుడి తల, మొండెం వేరు కావడంతో అప్పుడు ఎవ్వరన్నది తెలియరాలేదు. అన్ని కోణాల్లో లోతుగా దర్యాప్తు చేయడంతో చీలకబైలుకు చెందిన గుణశేఖర్ గా గుర్తించి మృతదేహాన్ని పంచనామా కోసం శ్రీనివాసపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

సౌకర్యాలతో రైతుబజార్ సిద్ధం చేస్తాం : జేసీ


రైతుబజార్‌లో మరమ్మతు పనులను పరిశీలిస్తున్న జేసీ ఆదర్శరాజేంద్రన్

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 20: మదన పల్లె పట్టణంలోని వారపు సంత పక్కన రైతు బజార్‌ను రైతులకు అన్ని సౌకర్యా లతో సిద్ధం చేస్తున్నామని జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ పేర్కొన్నారు. శుక్రవారం మదనపల్లెకు వచ్చిన ఆయన స్థానిక రైతుబజార్‌లో చేపట్టిన మరమ్మతు పనులను పరిశీలిం చారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ రైతుబజార్‌కు వచ్చే రైతులకు తాగునీరు, విశ్రాంతి గది, మరుగుదొడ్ల మరమ్మతులకు రూ.1లక్ష నిధులు కేటాయిస్తామన్నారు. పది రోజుల్లోపు అన్ని పనులు పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ మార్కెటింగ్ ఏడీఎం త్యాగరాజుకు సూచించారు. రైతుబజార్‌లో రాత్రి పూట వీధిదీపాలు వెలిగేలా, ప్రతి రోజు పారిశుధ్య చర్యలు చేపట్ట డంతో పాటు కూరగాయల వ్యర్థాలను నిత్యం తొలగించాలని మున్సిపల్ కమిషనర్ ప్రమీ లను ఆదేశించారు. ఇప్పటికే రైతుబజార్‌లోని స్టాళ్లను కేటాయించేందుకు రైతులు, ఎఫ్‌పీ వోల నుంచి ఈనెల 27వ తేదీ వరకు దరఖాస్తులు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్ర మంలో సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్, మార్కెటింగ్‌శాఖ అధికారులు పాల్గొన్నారు.

కూటమి వంద రోజుల పాలనపై ప్రజలకు వివరిస్తాం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 20: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికా రంలోకి వచ్చి 100 రోజుల్లో ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలు, సమ స్యల పరిష్కార వేదికలపై ప్రజలకు వివరిస్తామని ఎమ్మెల్యే షాజహాన్ బాషా పేర్కొన్నారు. ఇందు కోసం శని వారం నుంచి మదనపల్లె నియోజకవ ర్గంలో 'మంచి ప్రభుత్వం- మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహిస్తామని ఎమ్మెల్యే తెలిపా రు. శుక్రవారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో అరాచకమే ధ్యేయంగా ప్రజలను వేధించి, ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు బనాయించారన్నారు. కాని చంద్రబాబు సీఎంగా 100 రోజుల పాలనలో సూపర్ సిక్స్ పథకాల అమలుకు చర్యలు తీసుకుని ఆచరణలో పెడుతున్నారన్నారు. అందరు ప్రభుత్వ శాఖల అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. తొలుత మాలిక్ ఫంక్షన్ హాల్లో, 22వ తేదీ దేవళం వీధిలో, 23న పోతబోలు, కొండామరిపల్లె, 24న రెడ్డివారిపల్లె, 25న రామసముద్రం మండలం ఆర్.నడింపల్లె, 26న సీటీఎం పంచాయతీలో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ప్రజలు వచ్చి వారి సమస్యలు తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ప్రమీల, టీడీపీ నాయకులు నాదెళ్ల శివన్న, శ్రీని వాసులు, నవీన్‌చౌదరి, సుధాకర్, పఠాన్ ఖాదర్‌ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

బీసీల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న కూటమి ప్రభుత్వం


చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

ములకలచెరువు, సెప్టెంబరు 20: ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం బీసీ ల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తంబళ్లపల్లె నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి పోతుల సాయినాథ్, టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి గుత్తికొండ త్యాగరాజు పేర్కొన్నారు. శుక్రవారం వారు టీడీపీ జిల్లా కార్యదర్శి యర్రగు డి సురేష్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కేవీ రమణలతో కలిసి మాట్లాడారు. అనంతరం .రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో బీసీలకు 33శాతం రిజర్వేషన్లకు ఆమోదం తెలిపి కేంద్రానికి పంపడం, బీసీ రక్షణ చట్టానికి విధివిధానాలు రూపొందించి అమలు చేసేం దుకు తీర్మాణించడంపై ములకలచెరువులో టీడీపీ, జనసేన నాయకులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ చత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు భజంత్రి రామాంజులు, పాస్టర్ శ్రీనివాసులు, కట్టా హరినాథ్, షామీర్, వెంకటరమణ, బావాజాన్, వెంకటసిద్ధయ్య, రామచంద్ర, గురుమూర్తి, శివారెడ్డి, రంగాళ్ల శ్రీనివాసులు, గంగాదేవి తదితరులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో సత్తాచాటిన గిరిజన గురుకుల విద్యార్థులు

తంబళ్లపల్లె, సెప్టెంబరు 20: తంబళ్లపల్లె మండల స్థాయి అథ్లెటిక్స్‌లో మండల కేంద్రం లోని గిరిజన బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులు సత్తాచాటినట్లు పీఈటీ దేశ్‌ముఖ్ తెలిపారు. శుక్రవారం కన్నెమడుగు ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వ ర్యంలో అండర్-14, 17 విభాగాలలో మండల స్థాయి అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. అండర్-14 విభాగంలో రాంచరణ్ నాయక్ 100 మీటర్ల పరుగు పందెం, లాంగ్ జంప్‌లో మొదటి స్థానం, హైజంప్‌లో ద్వితీయ స్థానం, 400 మీటర్ల పరుగు పందెంలో తృతీయ స్థానం సాధించగా, 200 మీటర్ల పరుగుపందెంలో బాబునాయుడు ద్వితీయ స్థానం సాధించాడన్నారు. అండర్-17 విభాగంలో నిరంజన్‌నాయక్ డిస్కస్ త్రోలో మొదటి స్థానం, షార్ట్‌పుట్‌లో ద్వితీయస్థానం, 400 మీటర్ల పరుగుపందెం, హైజంప్‌లో తృతీయ స్థానం సాధించగా, సాయినాయక్ లాంగ్‌జంప్‌లో ద్వితీయ స్థానం సాధించాడన్నారు. వారు త్వర లో కురబలకోటలో జరుగబోయే నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలలో పాల్గొంటారన్నారు. క్రీడలలో ప్రతిభ చూపిన విద్యార్థులను ఎంఈవోలు త్యాగరాజు, నాగసుబ్బరాయుడు, హెచ్ ఎం షభానా, ఉపాధ్యాయులు అభినందించారు.

క్యాన్సర్ బాధితుడికి పూర్వ విద్యార్థుల ఆర్థిక సాయం


క్యాన్సర్ బాధిత విద్యార్థి కుటుంబీకులకు సాయమందిస్తున్న పూర్వ విద్యార్థులు

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 20: క్యాన్సర్‌తో బాధపడుతున్న ఓ ఇంజినీరింగ్ చదివి న విద్యార్థికి పూర్వ విద్యార్థులు ఆర్థిక సహాయం అందించారు. మదనపల్లె సమీ పంలోని ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల పూర్వ విద్యార్థి టి.వేదానంద్ బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో బెంగళూరులోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వేదానంద్‌కు రూ.4లక్షలు వైద్య ఖర్చులు అవుతాయని ఆస్పత్రి యజమాన్యం తెలిపింది. విషయం తెలుసుకున్న ఈ కళాశాల పూర్వ విద్యార్థులు కలసి రూ.50వేలు సేకరించారు. ఈ మొత్తాన్ని శుక్రవారం కళాశాల డైరెక్టర్ రామలింగారెడ్డి, చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, ప్రెసిడెంట్ నాగమల్లారెడ్డి చేతుల మీదుగా బాధిత విద్యార్థి కుటుంబీకులకు అందజేశారు.

ఉచిత ఇసుక పథకం అమలుపై లోకేశ్‌కు కృతజ్ఞతలు


మంత్రి లోకేశ్‌ను కలసిన శ్రీరామ్‌చినబాబు

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 20: రాష్ట్రవ్యాప్తంగా ఉచిత ఇసుక విధానం అమలు, ఆన్‌లైన్‌లో బుకింగులు ప్రారం భించడంపై రాష్ట్ర మంత్రి లోకేశ్‌కు తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్‌చినబాబు కృతజ్ఞతలు తెలిపారు. శుక్ర వారం రాత్రి చిత్తూరు జిల్లా బంగారుపాళెంకు చేరుకున్న నారాలోకేశ్‌ను మదనపల్లె టీడీపీ నాయకులు మర్యాదపూ ర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా యువగళంలో లోకేశ్ ఇచ్చిన హామీలు అమలు చేయడాన్ని చినబాబు కీర్తించారు. మదనపల్లె మండలంలో 500కిలోమీటర్ల పాదయాత్ర పూర్తి అయిన సందర్భంగా ఆవిష్కరించిన శిలాఫలకం, టమోటా ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుపై లోకేశ్ చర్చించారని చిన బాబు తెలిపారు. అలాగే టీడీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రాటకొండ మధుబాబు, కంచెర్ల చింటూ తదితరులు నారా లోకేశ్‌ను కలిశారు.

మంత్రి నారాలోకేశ్‌ను కలిసిన ఎమ్మార్పీఎస్ నేత

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు20: రాష్ట్ర మంత్రి నారాలోకేశ్ తొలిసారిగా చిత్తూరు జిల్లా పర్యటనలో బంగారు పాళెం నిర్వ హించే ప్రజావేదికలో శుక్రవారం ఎమ్మా ర్పీఎస్ నేత ఎస్ నరేంద్రబాబు మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతం దుశ్శాలు వను కప్పి లోకేశ్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా నరేంద్రబాబు మాట్లాడుతూ మంత్రి నారా లోకేశ్ ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణమాదిగ కూటమి అధికారంలోకి రావడానికి చాలా కృషి చేసినట్లు మంత్రి లోకేష్ పేర్కొన్నారన్నారు.

ఇద్దరిపై కేసు నమోదు

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 20: పోలీసులను దూషించారని టూటౌన్ సీఐ రామచంద్ర ఆదేశాల మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ ఎస్ఐ రహంతుల్లా తెలిపారు. నెమలినగర్‌కు చెందిన గిరిధర్‌రెడ్డి, మదనపల్లె మండలం, కొత్తపల్లె పంచాయతీ వడ్డిప ల్లెకు చెందిన మహమ్మద్ ఇషాక్ గురువారం రాత్రి ఆర్టీసీ బస్టాండ్‌లో కేకలు వేయడం, వచ్చిన పోలీసులను దూషించారన్నారు. ఎస్ఐ రవికుమార్ ఫిర్యాదు మేరకు శుక్రవారం రాత్రి ఇద్దరిపై కేసునమోదు చేశారని ఎస్ఐ తెలిపారు.

జిల్లా ఆస్పత్రి ఆర్‌ఎంకు ఫిర్యాదు

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు20: వివిధ ప్రాంతాల నుంచి రోగులను జిల్లా ఆస్పత్రికి తీసుకొస్తున్నా ఆశా వర్కర్లను సెక్యూరిటీ అడ్డుకుంటున్నారని శుక్రవారం జిల్లా ఆస్పత్రి ఆర్‌ఎంవో ప్రసాదరాజుకు ఫిర్యాదు చేశారు. దీంతో వెంటనే సెక్యూరిటీ జ్యోతిని పిలిచి యూనిఫామ్‌లో ఉంటారు అంతమాత్రం తెలియదా? అని మందలించారు.